


Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 79 | శనివారం 16 ఆగస్టు 2025 | పేజీలు : 8 | వెల రూ. 6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- ముప్పన్నెల పతాకాన్ని ఎగురవేసిన ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, రాహుల్ గాంధీ, కర్నాటక సీఎం సిద్ధారామయ్య, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



## చరిత్ర సృష్టించే సమయం వచ్చింది

- అమెరికాను పట్టించుకోనక్కర్లేదంటూ మోదీ పరోక్ష వ్యాఖ్యలు
- ప్రపంచ మార్కెట్‌ను మనమే ఏలాలని వ్యాఖ్య
- రైతుల శ్రేయస్సుపై రాజీ పడేది లేదని స్పష్టం చేసిన మోదీ

2లో

## స్వాతంత్ర్య వేడుకలను బహిష్కరించిన కాంగ్రెస్ అగ్రనేతలు?

## ప్రగతి పథంలో రాష్ట్రం

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

2లో

## వైసీపీ పాలనతో రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కి

- గుంటూరులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో
- లోకేష్ రాజకీయ ఉపన్యాసం



2లో

## భావోద్వేగాలను రెచ్చగొట్టే కుట్రలను అడ్డుకుంటాం

- 2047 నాటికి తెలంగాణ గేమ్ ఛేంజర్ అవుతుంది
- హైడ్రాపై విషప్రచారాన్ని తిప్పికొట్టండి
- మూసీ పునరుజ్జీవంతోనే హైదరాబాద్‌లో వరదలకు అడ్డుకట్ట
- గోదావరి, కృష్ణాలో ఒక్క నీటి చుక్కను వదులుకోం
- కాళేశ్వరం లేకున్నా రాష్ట్రంలో 2.85 కోట్ల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి
- బీసీ రిజర్వేషన్లకు కేంద్రం ఆమోదం తెలపాలి
- గోల్కొండ కోటలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి

2లో

## కర్ణాటకపై కేంద్రం వివక్ష

- సిద్ధరామయ్య

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## నాలెడ్జ్ ఎకానమీదే భవిష్యత్

- పేదల సంక్షేమం వివరిస్తూ సాగిన సీఎం చంద్రబాబు పంద్రాగస్టు ప్రసంగం
- సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అన్న ముఖ్యమంత్రి
- మేనిఫెస్టో హామీలు, ఐదు సంతకాల మలు తీరును సోదాహరణంగా వివరించిన సీఎం
- విధ్వంసం నుంచి వికాసం వైపు ప్రయాణిస్తున్నామన్న చంద్రబాబు
- బనకచర్లను ప్రస్తావిస్తూ... ఎగువ రాష్ట్రానికి ప్రశ్నలు
- రాజకీయ ముసుగులో నేరాలంటూ వైసీపీకి చురకలు
- అమెరికా విధించిన సుంకాలపై ప్రస్తావన



అమరావతి-సూర్య వాస్తవం, ఆగస్టు 15

రాష్ట్రంలో పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ సీఎం చంద్రబాబు స్వాంతంత్ర్య దినోత్సవం ప్రసంగం చేశారు. సూపర్ సిక్స్ హామీలు మొదలుకుని.. వివిధ సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి తన పంద్రాగస్టు ప్రసంగంలో ఏకరువు పెట్టారు. సూపర్ సిక్స్... సూపర్ హిట్ అంటూ స్వాతంత్ర్య దినోత్సవ వేదిక నుంచి చంద్రబాబు సగర్వంగా ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు అమలు చేసిన సామాజిక భద్రత ఫించన్లు మొదలుకుని శుక్రవారం ప్రారంభించిన స్త్రీ శక్తి పేరుతో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం వరకు ప్రతి అంశాన్ని ఆసాంతం వివరించారు. ఫించన్లు, తల్లికి వందనం, దీపం-2.0, అన్నదాత సుఖీభవ వంటి పథకాల గురించి చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు.

- మిగతా 2లో..

# చరిత్ర సృష్టించే సమయం వచ్చింది

**- అమెరికాను పట్టించుకోనక్కర్లేదంటూ మోదీ పరోక్ష వ్యాఖ్యలు**

**- ప్రపంచ మార్కెట్‌ను మనమే ఏలాలని వ్యాఖ్య**

**- రైతుల శ్రేయస్సుపై రాజీ పడేది లేదని స్పష్టం చేసిన మోదీ**

**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం, ఆగస్టు 15**

ప్రపంచంలో కొన్ని దేశాలకు ఆర్థిక స్వార్థం పెరిగిపోయిందంటూ ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మన దేశంపై విధించిన టారిఫ్ లను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. కొన్ని దేశాలకు ఆర్థిక స్వార్థం పెరిగిపోయిందని విమర్శించారు. అమెరికా టారిఫ్‌ల గురించి ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, మన లక్ష్యాలను అందుకోవడానికి ముందుకు సాగడమే ప్రస్తుతం మన విధి అని పేర్కొన్నారు. మన రైతుల శ్రేయస్సు విషయంలో రాజీపడేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఎలాంటి ఒత్తిళ్లకూ తలొగ్గబోమని తేల్చిచెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచ మార్కెట్ ను మనమే ఏలాలని, ఆ దిశగా భారత్ ముందుకు వెళుతోందని చెప్పారు. ఈ విషయంలో భారత్ ను ఏదీ అడ్డుకోలేదని పేర్కొన్నారు. చరిత్ర సృష్టించే సమయం వచ్చిందని వ్యాఖ్యానిస్తూ.. తక్కువ ధరకు అత్యధిక నాణ్యతే మన లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రపంచ మార్కెట్ లో నాణ్యమైన వస్తుసేవలను అందుబాటులో ఉంచడం ద్వారా భారతదేశ శక్తిని ప్రదర్శించాలని పేర్కొన్నారు. ఇతరులు చిన్నచూపు చూస్తున్నారనే విషయంపై మన శక్తినంతా వృధా చేసుకోవడం కాకుండా మనల్ని మనం బలంగా తీర్చిదిద్దుకునేందుకు ప్రయత్నం చేయాలని ప్రధాని మోదీ సూచించారు.

# కర్ణాటకపై కేంద్రం వివక్ష : సిద్ధరామయ్య

**బెంగళూరు -సూర్య వాస్తవం, ఆగస్టు 15**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాలపై వివక్ష చూపుతోందని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విమర్శించారు. 79వ స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమంలో మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేసిన అనంతరం ఆయన ప్రసంగించారు. కర్ణాటకకు నిధుల విడుదల విషయంలో కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంద న్నారు. అందుకే తమ ప్రభుత్వం సొంతగా అభివృద్ధి నమూనాలను అనుసరిస్తోందన్నారు. అంతేకాదు కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారంటీ స్కీమ్‌లు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయన్నారు. ఐక్యరాజ్యసమితి సాధారణ సభ అధ్యక్షులు ఫిలేమన్ యాంగ్ స్వయంగా ఇక్కడకు వచ్చి పథకాలను పరిశీలించారని సిద్ధరామయ్య తెలిపారు. మరోవైపు ఆదాయ పన్ను విభాగం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) వంటి కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తూ వాటిని ప్రతిపక్షాల నేతలపై మోడీ సర్కార్ ఉసిగొల్పుతోందని, ఇది ప్రజాస్వామ్య విలువలకు పాతర వేయడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం అనుసరిస్తున్న ఈ దుర్మార్గ వైఖరిని వ్యతిరేకిస్తూ ప్రజలందరూ గొంతుక వినిపించాలన్నారు. దేశంలో 80 శాతం సంపద కేవలం 10 శాతం వ్యక్తుల గుప్పిటే ఉందని చాలా సంస్థల సర్వేలు వెల్లడిస్తున్నాయని సిద్ధరామయ్య గుర్తు చేశారు. వారు సమష్టిగా జిఎస్‌టికి అందిస్తున్న మొత్తం 3 శాతం మాత్రమేనని విమర్శించారు. సాధారణ ప్రజలు 97 శాతం సమకూరుస్తున్నట్లు వెల్లడించారు. కర్ణాటకను మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా చేసేందుకు సమష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రగతి పథంలో రాష్ట్రం

**- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్**

**కాకినాడ-సూర్య వాస్తవం, ఆగస్టు 15**

టిడిపి కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ అన్నారు. కాకినాడలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గన్నారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ఎందరో త్యాగాల వల్ల దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, దీన్ని సద్వినియోగం చేసుకుంటూ దేశాన్ని కాపాడుకోవాలని అన్నారు. శాంతి భద్రతలు సుస్థిరంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయని తెలిపారు. దీని కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషికి ప్రజలందరూ తోడ్పాటు అందించాలని కోరారు. ప్రతిపక్ష నాయకులు, ఓడిపోతే ఓటు చోరీ అంటున్నారని, గెలిచినప్పుడు ఒక న్యాయం, ఓడినప్పుడు ఒక న్యాయమా? అని వైసిపిని ఉద్దేశించి మాట్లాడారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా మలిచే లక్ష్యంతో ఇప్పటి వరకూ రూ.308 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. అనంతరం పలువురికి పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమంలో పవన్‌కల్యాణ్ సతీమణి అన్నాలెజ్నేవా, కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎంఎల్‌సిలు, కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, ఎంఎల్‌ఎలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ, నిమ్మకాయల చినరాజప్ప తదితరులు పాల్గన్నారు.

## వైసీపీ పాలనతో

# రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కి

**- గుంటూరులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో**

**- లోకేష్ రాజకీయ ఉపన్యాసం**

**గుంటూరు -సూర్య వాస్తవం, ఆగస్టు 15**

గత ప్రభుత్వ తప్పిదాల వల్ల రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని రాష్ట్ర మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేష్ విమర్శించారు. గుంటూరు పోలీసు పేరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. తొలుత జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. సహజంగా స్వాతంత్ర్య దినోత్సవంలో అధికారులు రాసి ఇచ్చిన ప్రసంగ పాఠాలను చదవడం ఇప్పటి వరకు ఆనవాయితీ కాగా మంత్రి లోకేష్ తొలిసారిగా ఈ ప్రసంగ పాఠాన్ని పక్కన పెట్టి సాధారణ, రాజకీయ, స్వాతంత్ర్య ఘట్టాలను, తన చిన్ననాటి జ్ఞాపకాలను ప్రస్తావించారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో చీకటి పాలన జరిగిందని విమర్శించారు. గత ప్రభుత్వ హయంలో రూ. పది లక్షల కోట్లు అప్పులు చేసి అభివృద్ధిలో 30 ఏళ్లు వెనక్కి నెట్టారన్నారు. అందువల్లే వైసిపి అడ్రస్సు లేకుండా పోయిందని పేర్కొన్నారు. 2024లో ప్రజలు చరిత్ర సృష్టించి టిడిపి కూటమి 164 సీట్లు కట్టబెట్టారన్నారు. డబుల్ ఇంజన్ సర్కారుతో రాష్ట్రం చీకటి నుంచి వెలుగు వైపు తొలి అడుగు వేసిందని చెప్పుకొచ్చారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అందులో భాగంగా పలు బడా కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని అన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా 67.27 లక్షల మందికి రూ.10,091 కోట్లు అందించామన్నారు. అన్నదాతా సుఖీభవలో తొలి విడత రూ.ఏడు వేలు ఇచ్చామని తెలిపారు. ఇచ్చిన హామీల మేరకు పింఛన్ల సొమ్ము పెంచామన్నారు. మహిళలకు ఉచిత బస్సును ప్రారంభించామని తెలిపారు. ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఇచ్చామన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో రాష్ట్రం పురోగమనంలో పయనిస్తుందని, విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చామని వివరించారు. జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి, రామాంజనేయులు, నశీర్ అహ్మద్, తెనాలి శ్రావణ్‌కుమార్, ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకలను

# బహిష్కరించిన కాంగ్రెస్ అగ్రనేతలు?

**- ఎర్రకోటలో స్వాతంత్ర్య వేడుకలకు దూరంగా రాహుల్, ఖర్గే**

**- గతేడాది సీటింగ్ వివాదంతోనే గైర్హాజరైనట్లు ఊహాగానాలు**

**- రాహుల్ గైర్హాజరుపై బీజేపీ తీవ్ర విమర్శలు**

**- పార్టీ కార్యాలయాల్లో వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు**

**న్యూఢిల్లీ-ఆసూర్య వాస్తం, ఆగస్టు 15**

ఢిల్లీలోని ఎర్రకోటలో నేడు జరిగిన 79వ స్వాతంత్ర్య వేడుకలకు కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ హాజరుకాకపోవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. గతేడాది జరిగిన కార్యక్రమంలో రాహుల్ గాంధీకి కేటాయించిన సీటుపై నెలకొన్న వివాదం కారణంగానే వారు ఈసారి వేడుకలకు దూరంగా ఉన్నారనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడనప్పటికీ, ఇద్దరు నేతలు సోషల్ మీడియా ద్వారా దేశ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పార్టీ ప్రధాన కార్యాలయంలో, రాహుల్ గాంధీ ఇందిరా భవన్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. "గొప్ప స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలతో సాధించుకున్న ఈ స్వేచ్ఛ మనందరి బాధ్యత" అని రాహుల్ పేర్కొన్నారు. అయితే, లోక్‌సభ ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ ఎర్రకోట వేడుకలకు గైర్హాజరు కావడంపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా మాట్లాడుతూ ఇది జాతీయ వేడుక అని, మోదీపై వ్యతిరేకతతో రాహుల్ దేశ వ్యతిరేక వైఖరి ప్రదర్శిస్తున్నారని ఎక్స్ వేదికగా విమర్శించారు. ఇది రాజ్యాంగాన్ని, సైన్యాన్ని అవమానించడమేనని ఆయన ఆరోపించారు.

**గతేడాది ఏం జరిగిందంటే..**

గతేడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ వివాదం మొదలైంది. క్యాబినెట్ మంత్రి హోదా ఉన్న రాహుల్ గాంధీకి ప్రొటోకాల్ ప్రకారం ముందు వరుసలో సీటు కేటాయించాల్సి ఉండగా, ఆయనను దాదాపు చివరి వరుసలో కూర్చోబెట్టారు. అప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్‌ను ఐదో వరుసలో ఒలింపిక్ పతక విజేతల వెనుక కూర్చోబెట్టడం తీవ్ర దుమారం రేపింది.

అప్పట్లో ఈ విషయంపై రక్షణ మంత్రిత్వ శాఖ వివరణ ఇచ్చింది. ఒలింపిక్ విజేతలను గౌరవించేందుకే సీటింగ్ ఏర్పాట్లలో మార్పులు చేశామని, కొందరు కేంద్ర మంత్రులు కూడా వారి వెనుక కూర్చున్నారని తెలిపింది. అయితే, కాంగ్రెస్ ఈ వివరణను తోసిపుచ్చింది. ఒలింపియన్లకు గౌరవం ఇవ్వాల్సిందేనని, కానీ కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్ వంటి వారు ముందు వరుసలో ఎలా కూర్చున్నారని కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. ఈ నేపథ్యంలోనే ఈసారి రాహుల్, ఖర్గే వేడుకలకు హాజరుకాలేదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# నాలెడ్జ్ ఎకానమీదే భవిష్యత్

(మొదటిపేజీ తరువాయి)

దీంతో పాటు.. తాను చేసిన తొలి సంతకాల అమలును ముఖ్యమంత్రి వివరించారు. అలాగే ఏపీ బ్రాండ్ గురించి.. పెట్టుబడుల సాధనకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. దీంతో పాటు రాష్ట్రంలోని వివిధ వర్గాలకు అందించిన సేవలను.. ఆయా రంగాల కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వివరించారు.

**వైసీపీ తీరుపై చంద్రబాబు చురకలు**

శాంతి భద్రతలపై ప్రభుత్వ విధానాన్ని ప్రస్తావించిన సందర్భంగా పరోక్షంగా వైసీపీకి చంద్రబాబు చురకలంటించారు. కొందరు రాజకీయ ముసుగులో నేరాలు చేస్తూ.. ప్రోత్సహిస్తున్నారని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను వివిధ సందర్భాల్లో చంద్రబాబు ప్రస్తావించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు, తప్పులు ప్రతి శాఖలో వెలుగు చూస్తున్నాయని గత పాలకుల తీరును తప్పుపట్టారు. గత ప్రభుత్వం నిలిపేసిన పథకాలను తాము పునరుద్దరించామనే విషయాన్ని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల విషయంలో వైసీపీ ప్రభుత్వం ఆడిన డ్రామాలను గుర్తు చేశారు. గత ప్రభుత్వం గుంతలతో వదిలేసిన రోడ్ల తీరును ముఖ్యమంత్రి వివరించారు. కొత్త జిల్లాలను గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా ఏర్పాటు చేసిందని.. ఇప్పుడు వాటిని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని సీఎం చెప్పారు. మద్యం, ఇసుక వంటి వాటిల్లో గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ప్రస్తావించిన చంద్రబాబు. ఇక ఎస్సీలకు, మైక్రో, డ్రిప్ సబ్సీడీలను గత ప్రభుత్వం నిలిపేసిందని గుర్తు చేయడంతోపాటు.. గతంలో జరిగిన రెవెన్యూ అక్రమాలను సరి చేసి.. పేదల భూములకు రక్షణ కల్పించామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**బనకచర్లకు కట్టుబడే ఉన్నాం**

ఇక ఇరిగేషన్ రంగంలో జరిగిన పరిణామాలను వివరిస్తూ.. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు గురించి కీలక ప్రస్తావన చేశారు. వృధాగా సముద్రంలో కలుస్తున్న వరద జలాలను వినియోగించుకుంటే.. ఎగువ రాష్ట్రాలకు ఇబ్బంది ఉండదని చెప్పడం ద్వారా బనకచర్ల విషయంలో ప్రభుత్వ విధానాన్ని మరోసారి చంద్రబాబు స్పష్టం చేశారు. వరద వచ్చినప్పుడు కిందకు వదిలేస్తున్న వాళ్లు.. అదే వరద నీటిని వాడుకుంటే అభ్యంతరం చెప్పడం సమంజసమా అని చంద్రబాబు ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం, బీఆర్ఎస్ పార్టీ బనకచర్ల విషయంలో చేస్తున్న వాదనల నేపథ్యంలో ఏపీ వాదనను.. రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని స్వాతంత్ర్య దినోత్సవ వేదికగా మరోసారి స్పష్టం చేయడం ఆసక్తి పరిణామంగా నిలిచింది. హంద్రీ-నీవా కాల్వల వెడల్పు పనులను రికార్డు స్థాయిలో పని చేసిన అంశాన్ని ప్రస్తావిస్తూనే.. ఈ ఏడాది ఉత్తరాంధ్ర, గాలేరు-నగరి వంటి ప్రాజెక్టులపై దృష్టి సారిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

**ప్రధానికి అండగా ఉందాం**

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం పూర్తిగా సహకరిస్తుందని చంద్రబాబు పంద్రాగస్టు ప్రసంగంలో వెల్లడించారు. తాజాగా కేంద్రం ప్రభుత్వం కేటాయించిన సెమీ కండక్టర్ల యూనిట్ గురించి, విశాఖ స్టీల్ ప్లాంట్ కు నిధుల కేటాయింపు వంటి అంశాలను చంద్రబాబు ప్రస్తావించారు. దీంతో పాటు ఇటీవల అమెరికా భారతదేశంపై విధించిన సుంకాల నేపథ్యంలో మన దేశ ఎకానమీ గురించి చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. మనది డెడ్ ఎకానమీ కాదు.. గుడ్ ఎకానమీ అంటూ చంద్రబాబు వ్యాఖ్యానించారు. తద్వారా రాష్ట్రం, రాష్ట్ర ప్రజలు ప్రధానికి అండగా ఉంటామని చంద్రబాబు సంకేతామిచ్చారు. అలాగే ఆపరేషన్ సిందూర్ చేపట్టిన త్రివిధ దళాలకు సీఎం స్వాతంత్ర్య దినోత్సవ వేదికపై నుంచి సెల్యూట్ చేశారు. వివిధ శాఖల ప్రగతిని వివరిస్తూ ప్రదర్శించిన శకటాలు అందర్నీ ఆకట్టుకున్నాయి.

## భావోద్వేగాలను రెచ్చగొట్టే

# కుట్రలను అడ్డుకుంటాం

**హైదరాబాద్ - సూర్య వాస్తవం, ఆగస్టు 15**

భావోద్వేగాలను రెచ్చగొట్టి రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పించే చర్యలకు పాల్పడితే ఎవర్నీ ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ప్రజలు కూడా ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండి, అలాంటి ప్రయత్నాలను అడ్డుకోవాలని సూచించారు. 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం భారతదేశ ముఖచిత్రాన్ని మార్చే గేమ్ ఛేంజర్ కాబోతోందని స్పష్టంచేశారు. 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు హైదరాబాద్‌లోని చారిత్రాత్మక గోల్కొండ కోటలో శుక్రవారం ఘనంగా జరిగాయి. సీఎం రేవంత్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. జై ఇండియా..జై తెలంగాణ అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన అనేక అంశాలను ప్రస్తావించారు. 2035 నాటికి ఒక ట్రిలియన్, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడమే తమ ముందున్న కర్తవ్యమని చెప్పారు. దీనికోసమే "తెలంగాణ రైజింగ్-2047" విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించామనీ, ఈ ఏడాది డిసెంబర్ నాటికి దీన్ని ప్రజల ముందు చర్చకు పెడతామని తెలిపారు. మూసీ పునరుజ్జీవం నుంచి గ్రామీణ తెలంగాణ వ్యవసాయ వికాసం వరకు ఈ విజన్‌లో పొందుపర్చామన్నారు. "ప్రపంచ వేదికపై హైదరాబాద్‌ను బ్రాండింగ్ చేసేందుకు ఇటీవల 72వ ప్రపంచ సుందరి పోటీలను నిర్వహించాం. దీనివల్ల మన చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపదను ప్రపంచ దేశాలకు చూపించే అవకాశం కలిగింది" అని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), గ్లోబల్ రైస్ సమ్మిట్, బయోఏషియా సదస్సు, భారత్ సమ్మిట్ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించి, తెలంగాణ విజన్‌ను ప్రపంచానికి పరిచయం చేసే ప్రయత్నం చేశామని వివరించారు. రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్, విజయవాడ జాతీయ రహదారి, ఫ్యూచర్ సిటీతో పాటు త్వరలో ప్రారంభం కానున్న వరంగల్, అదిలాబాద్ ఏయిర్ పోర్టులు తెలంగాణ అభివృద్ధికి దిక్సూచిగా మారతాయన్నారు. హైదరాబాద్ మెడికల్ హబ్‌గా మారుతోందనీ, ఇక్కడి నుంచే 40 శాతం బల్క్ డ్రగ్స్ విదేశాలకు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెంటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు.

**హైడ్రాపై రాజకీయ విమర్శలు**

హైదరాబాద్‌ను స్వచ్ఛమైన. సౌకర్యవంతమైన నగరంగా తీర్చిదిద్దాలనేది తమ ప్రభుత్వ ఆలోచన అనీ, దానికోసమే హైడ్రాను ఏర్పాటు చేశామన్నారు. బెంగుళూరు, ముంబాయి, చెన్నై లాంటి నగరాలు వరదలతో చిన్నాభిన్నం అవుతున్నాయనీ, హైదరాబాద్‌కు ఆ దుస్థితి రాకూడదనే కఠినంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. హైడ్రా ఇప్పటి వరకు 13 పార్కులు, 20 సరస్సులను అక్రమణల నుంచి రక్షించిందనీ, రూ.30 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడిందని వివరించారు. కేవలం స్వీయ ప్రయోజనాల కోసమే ప్రతిపక్షాలు దీన్ని రాజకీయం చేస్తున్నాయనీ, ప్రజల బాగోగుల గురించి పని చేస్తున్న హైడ్రాపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**ఒక్క నీటి చుక్కనూ వదులుకోం**

గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాలో ఒక్క నీటి చుక్కను కూడా వదులుకునే ప్రసక్తే లేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. నీటి వాటాల విషయంలో ఎవరి బెదిరింపులకు లొంగేది లేదని తేల్చి చెప్పారు. తెలంగాణ భూములు సస్యశ్యామలం అయ్యాకే ఇతర ప్రాంతాలకు నీరివ్వడం గురించి ఆలోచిస్తామన్నారు. గత ప్రభుత్వం కాళేశ్వరం పేరుతో రూ.లక్ష కోట్లను గోదావరిలో వృధాగా పోసి, ఇప్పుడు మళ్లీ సెంటిమెంట్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

**ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాం**

కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించామన్నారు. ప్రజలు, ఉద్యమకారులు, అమరవీరుల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా విధాన నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు.

**బీసీ, ఎస్సీలకు న్యాయం చేశాం**

కుల గణనతో బలహీనవర్గాల వందేండ్ల కలను, ఎస్సీ వర్గీకరణతో దశాబ్ధాల నిరీక్షణకు తెరదించామని అన్నారు. "కుల గణన ప్రామాణికంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం శాసనసభ ఆమోదించిన రెండు బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. రిజర్వేషన్ల బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదింపజేసి చట్టరూపం ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

**3.10 కోట్ల మందికి సన్నబియ్యం**

"రాష్ట్రంలో రూ.13 వేల కోట్లతో 3.10 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నాం. ఈ రోజు ధనికులతో సమానంగా రాష్ట్రంలో పేదవారు సన్న బియ్యంతో భోజనం చేస్తున్నారు. పదేండ్ల నిరీక్షణకు తెరదించుతూ రాష్ట్రంలోని అర్హులైన పేదలకు రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించాం" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అలాగే రాష్ట్రంలోని 25.35 లక్షల మంది రైతులకు, రూ.20,616 కోట్ల రుణమాఫీ చేశామనీ, 'ఇందిరమ్మ రైతు భరోసా' ద్వారా కేవలం తొమ్మిది రోజుల్లోనే 70,11,184 మంది రైతులకు రూ.9 వేల కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామని చెప్పారు.

# సంపాదకీయం

## కొత్త భారత్‌ను ఆవిష్కరిద్దాం...



దేశవ్యాప్తంగా 79వ స్వాతంత్ర వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఢిల్లీలోని ఎర్రకోటలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జాతీయ జెండా ఎగరవేశారు. ప్రధానమంత్రి హోదాలో జాతీయ జెండాను ఎగరవేయడం ఇది 12వసారి. గతంలో ఏ ప్రధాన మంత్రి సాధించని ఘనతను నరేంద్ర మోడీ తన పేరు మీద లిఖించుకున్నారు.. దేశ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు మోదీ స్పష్టం చేశారు. మేడిన్ ఇండియా దేశ శక్తిని ప్రపంచానికి చాటుతుందన్నారు. సెమీకండక్టర్ల రంగంలో భారత్ పురోగతి సాధించింద న్నారు. ఇప్పటికే నాలుగు సెమీకండక్టర్ యూనిట్లు ప్రారంభించినట్లు గుర్తు చేసిన మోదీ.. మరో ఆరు సెమీకండక్టర్ యూనిట్లు రెడీ అవుతున్నట్లు తెలిపారు. . మేడిన్ ఇండియా సాయంతోనే ఆపరేషన్ సింధూర్ సక్సెస్ అయ్యిందన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయానికి అతిపెద్ద కారణం మన సాంకేతికత, రక్షణ రంగంలో మేక్ ఇన్ ఇండియా శక్తి అని అన్నారు. ఉగ్రవాదులను రక్షించడానికి వచ్చిన పాకిస్తాన్‌ను కొన్ని గంటల్లోనే మోకరిల్లేలా చేశామన్నారు. గత స్వాతంత్ర వేడుకల్లో తమ ప్రభుత్వం ఏం చేసిందో.. ఏం చేయబోతుందో నరేంద్ర మోడీ చెప్పేవారు. కానీ ఈసారి స్వాతంత్ర వేడుకల్లో పాకిస్తాన్ ను ఉతికి ఆరేశారు. అమెరికాకు పరోక్ష హెచ్చరికలు పంపించారు. కొద్దిరోజులుగా దేశంలో ఓటు చోరీ అంటూ హడావిడి చేస్తున్న రాహుల్ కు చురకలు అంటించారు. ఉగ్రవాదానికి సహకరించే వారికి గట్టి సమాధానం చెబుతాం. మన సైన్యానికి పూర్తిస్థాయిలో స్వేచ్ఛనిచ్చాం. న్యూక్లియర్ బెదిరింపులకు భయపడేది లేదు. ఎవరో హెచ్చరిస్తే వణికిపోయేది లేదు. దేశ సౌభాగ్యం కోసం ఎట్టి పరిస్థితుల్లో వెనుకడుగు వేసేది లేదు.. మన దేశం జోలికి వస్తే ఎవరినైనా వదిలిపెట్టేది లేదు. దాయాది దేశం మనల్ని కవ్విస్తే.. వారి దేశంలోకి వెళ్లి.. ఉగ్రవాదులను మట్టుపెట్టాం. రక్తం, నీళ్లు ఎప్పుడూ కలిసి ప్రవహించవు. డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ దేశ రాజ్యాంగం అమలు కోసం తన ప్రాణాన్ని త్యాగం చేశారు. సింధు నది మీద భారతదేశానికి పూర్తిస్థాయిలో హక్కులు ఉన్నాయి. ఉగ్రవాదులకు, వారికి మద్దతు ఇచ్చే వారిని వేరువేరుగా చూడము.. డాలర్ల మీద, పౌండ్ల మీద భారతదేశం ఆధారపడదు. ఆత్మ నిర్భర్ భారత్ ద్వారా స్వీయ సమృద్ధి సాధించామని" నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. "కొంతమంది వ్యక్తులు మన దేశ రాజ్యాంగాన్ని కించపరుస్తున్నారు. మన దేశ వ్యవస్థలను ప్రపంచ వేదికల మీద విమర్శిస్తున్నారు. ఇటువంటి విధానాలను భారత్ చూస్తూ ఊరుకోదు. దేశ ఔన్నత్యాన్ని.. దేశ సౌభాగ్యాన్ని కాపాడే బాధ్యతను మేం తీసుకున్నాం. ఆదే దిశగా అడుగులు వేస్తాం. అంతేతప్ప అడ్డగోలుగా ప్రవర్తిస్తే దానికి తగ్గట్టుగానే ఈ దేశ ప్రజలు సమాధానం చెబుతారు. బ్లాక్ మెయిల్ రాజకీయాలకు భయపడే రోజుల పోయాయి. భారత్ హితం కోసం ఎటువంటి నిర్ణయాలైనా తీసుకుంటాం. ఒక పట్లగా వెనుకంజ వేసే రోజులు కావు ఇవి. ఈ దేశం కోసం ఏం చేయాలో మాకు తెలుసు. ఈ దేశం కోసం ఎలాంటి అడుగులు వేయాలో కూడా మాకు తెలుసు అని" నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు.. అణుబాంబు బెదిరింపులకు భారత్ భయపడదని మోదీ అన్నారు. అది గతంలో నడించిందని.. ఇప్పుడు అటువంటి బ్లాక్‌మెయిల్స్‌కు భారత్ భయపడే ప్రసక్తే లేదని పరోక్షంగా పాక్ ఆర్మీ చీఫ్‌కు మోదీ కౌంటర్ ఇచ్చారు. ఉగ్రవాదం మానవాళి మనుగడే ముప్పు అని వ్యాఖ్యానించారు. సింధూ నీళ్లు కేవలం మన దేశ రైతులకు మాత్రమేనని తేల్చి చెప్పారు. ఎప్పటికీ నీరు, రక్తం కలిసి ప్రవహించవని అన్నారు. " సింధూ నది విషయంలో మరో మాట లేదు. వాటిని పాక్ కు ఇచ్చే ప్రసక్తే లేదు. దేశంలో నీటి కొరత ఉన్న ప్రాంతాలకు ఆ నీటిని తరలిస్తాం. సింధూ నదిపై సంపూర్ణ అధికారం భారత్‌దే. దీనిపై ఎప్పటికీ చర్చలు జరిపేది లేదు" అని మోదీ స్పషం చేశారు. భారత్ ఏ దేశానికి తీసిపోకూడదని ప్రధాని మోదీ అన్నారు. ఎవరినీ తక్కువ చేయడానికి మన శక్తిని వృథా చేయకూడదు. మనం మన మార్గాన్ని మరింత విస్తృతం చేసుకోవాలని దేశ ప్రజలకు సూచించారు. మనం మన మార్గాలను పెంచుకుంటే, ప్రపంచం కూడా మనల్ని గౌరవిస్తుంది.

ప్రపంచంతో పోటీ పెరుగుతున్నప్పుడు, ఆర్థిక స్వార్థం పెరుగుతుందన్నారు. మనం సంక్షోభాల సమయంలో కుంగిపోకుండా ధైర్యంగా ముందుకు సాగాలని మోదీ పిలుపునిచ్చారు. మనం ఓ మార్గాన్ని ఎంచుకుంటే, ఏ స్వార్థం మనల్ని వెనక్కి లాగలేదన్నారు. గత దశాబ్దంలో సంస్కరణ, పనితీరు బాగా రూపాంతరం చెందింది, కానీ ఇప్పుడు మరింత ఎదగాలంటే, అభివృద్ధి చెందాలంటే మనం మరింత కొత్త శక్తితో ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు 'నయా భారత్' అనే థీమ్‌తో జరుగుతున్నాయి. ఇది 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధించాలనే భారత ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆపరేషన్ సిందూర్ విజయాన్ని హైలైట్ చేస్తున్నాయి. జ్ఞానపథ్‌లో, వ్యూ కట్టర్‌లో ఆపరేషన్ చిహ్నం ఉంది. దాని థీమ్‌తో ప్రేరణ పొందిన ఫ్లవర్ ప్రజెంటేషన్ ప్రదర్శనలతో ఇది పూర్తి చేస్తారు. ఎర్రకోటలో ప్రసంగించే ముందు, ప్రధాని మోదీ కూడా చీలో పోస్ట్ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'వికసిత్ భారత్' కోసం ఒక విజన్‌ను షేర్ చేసుకుంటూ ప్రధాని మోదీ ఇలా రాసుకొచ్చారు. "అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. ఈ రోజు మనం స్వాతంత్ర్య సమరయోధుల కలలను సాకారం చేయడానికి, 2047 నాటికి వికసిత్ భారత్‌ను నిర్మించడానికి మరింత కష్టపడి పనిచేయాలి. అమరవీరుల త్యాగాలు మనల్ని ప్రేరేపించాలని కోరుకుంటున్నాను. జై హింద్!" అని మోదీ పోస్ట్ చేశారు.

# జగన్ కు బిగిస్తున్న ఉచ్చు



**విజయవాడ – సూర్య వాస్తవం**

ఏపీ లిక్కర్ స్కాంలో మాజీ ముఖ్యమంత్రి జగనే సూత్రధారి అని సిట్ అధికారుల విచారణలో వెల్లడైంది. లిక్కర్ పాలసీలో మార్పు, అక్రమార్కుల నియామకాలు వంటి కీలక నిర్ణయాలన్నీ ఆయన్న కనుసన్నల్లోనే జరిగాయని సిట్ అనుబంధ చార్జ్‌షీట్లో వెల్లడించింది. ఈ కేసులో జగన్ సన్నిహితులు పలువురు అరెస్ట్ అయినా మద్యం కుంభకోణంపై టీడీపీ, జనసేన ముఖ్యులెవరూ మాట్లాడటం లేదు. చట్టం తన పని తాను చేసుకుని పోతుందన్నట్లు వ్యవహరిస్తున్నారు. మిత్రపక్షాలు సైలెంట్ అయినా బీజేపీ నేతలు మాత్రం వైసీపీని టార్గెట్ చేస్తున్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాధవ్ సహా కాషాయ నేతలు బిగ్ బాస్ జగన్ అంటూ ముప్పేట దాడి చేస్తున్నారు. అసలు బీజేపీ అంత దూకుడు ప్రదర్శించడానికి కారణమేంటి? లిక్కర్ స్కాంలో జగన్ పాత్రపై సిట్ చార్జ్‌షీట్. ఆంధ్రప్రదేశ్‌లో అయిదేళ్లపాటు సాగిన మద్యం కుంభకోణంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ పాత్ర ఉందని సిట్ అధికారులు తమ అనుబంధ చార్జ్‌షీట్లో స్పష్టంగా పేర్కొంది. మద్యం వ్యాపారాన్ని అక్రమ సంపాదనకు రాజమార్గంగగా మార్చుకోవడానికి మాజీ సీఎం జగన్ ఎలాంటి అనుచిత నిర్ణయాలు తీసుకున్నారో వెల్లడించింది. ఉన్నతాధికారుల సిఫార్సులను పట్టించుకోకుండా నియామకాలు చేపట్టారని స్పష్టం చేసింది. సీఎంఓ మాజీ కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీల ప్రమేయానికి సంబంధించి సిట్ అభియోగాలు మోపింది. తాజాగా అనుబంధ ఛార్జ్ షీట్ దాఖలు చేసిన సిట్. తాజాగా విజయవాడ ఏసీబీ కోర్టులో సిట్ అధికారులు అనుబంధ చార్జ్ షీట్ దాఖలు చేశారు. గతంలో వేసిన చార్జ్‌షీట్లో ఏడుగురు వ్యక్తులు, 9 సంస్థలపై అభియోగాలు మోపగా.. అధనంగా ముగ్గురు నిందితులపై అభియోగాలు మోపింది. తాజా ఛార్జ్ షీట్లో హవాలా లావాదేవీలు, డొల్ల కంపెనీలకు సంబంధించిన నకిలీ డైరెక్టర్ల వివరాలు పొందుపరిచింది. మొత్తానికి లిక్కర్ స్కాంలో జగన్ నిర్ణయాలే కీలకమని స్పష్టం చేసింది. అయినా టీడీపీ, జనసేన నేతలు చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నట్లు వ్యవహరిస్తున్నారే కాని.. వైసీపీ మందిమగాదుల్ని కాని, జగన్‌ని కాని టార్గెట్ చేయడం లేదు. అయితే మిత్రపక్షమైన బీజేపీ మాత్రం అదే పనిగా పెట్టుకోవడం ఆసక్తికరంగా మారింది. బీజేపీ, వైసీపీ ఒక్కటే అని ఎప్పటి నుంచో ప్రచారం. బీజేపీ.. వైసీపీ ఒక్కటే.. అన్న ప్రచారం ఎప్పటి నుంచో ఉంది. దాన్ని ఎలాగైనా పోగొట్టాలని బిజెపి అష్టకష్టాలు పడుతోందట. తాజాగా లిక్కర్ స్కాంపై పదే పదే విమర్శలకు దిగుతోంది బిజెపి. ఒకవైపు టిడిపి మంత్రులకు చంద్రబాబు లిక్కర్ స్కాం పై మాట్లాడొద్దని ఆదేశాలిచ్చినా బిజెపి మాత్రం బిగ్ బాస్ జగనే అంటూ ముప్పేట దాడి చేస్తుంది. 2019 నుంచి 2024 వరకు ఎపిలో వైసిపి అధికారంలో ఉన్న సమయంలో కేంద్రం ఏ బిల్లు ప్రవేశపెట్టినా వైసిపి మద్ధతిచ్చింది. ప్రస్తుతం కూడా బీజేపీ అధిష్టానం తో మంచి రేపో నడుపుతుందన్న ప్రచారం జరుగుతోంది. ఆ క్రమంలో ఈ ప్రచారమే కూటమి ద్వితీయ శ్రేణి నేతల్లో కొంత ఆందోళన కలిగిస్తుంది. బీజేపీ ఏపి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మాధవ్ కు కూడా అది తలనొప్పిగా మారిందంట. దీంతో కూటమి శ్రేణులకు ఎలాగైనా దగ్గరవ్వాలనే యోచనలో వైసిపి అధినేత జగన్ పై మాటల దాడి పెంచాలని బీజేపీ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. గతంలో నాణ్యత లేని మద్యాన్ని ఎండగట్టిన పురంధేశ్వరి. గత వైసిపి పాలనలో జరిగిన అవినీతి ని ఎండగడుతూనే లిక్కర్ స్కాం ను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని బీజేపీ నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది. గతంలో పురంధేశ్వరి ఏపి బిజెపి అధ్యక్షురాలిగా ఉన్న సమయంలో మద్యం తాగి చనిపోయి, మంచాన పడ్డవారి లెక్కలతో సహా ప్రభుత్వాన్ని ఎండగట్టారు. తాజాగా మాధవ్ కూడా ఆమె లైన్ లోనే వెళ్తూ లిక్కర్ స్కాం లో త్వరలో బిగ్ బాస్ జగన్ జైలుకు వెళతారంటూ మాట్లాడడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు బిజెపి మంత్రి సత్యకుమార్ తో పాటు ఆపార్టీ ఎమ్మెల్యేలు వైపిపి లిక్కర్ స్కాం పై ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. లిక్కర్ స్కాంలో ఉన్న ఏ ఒక్కరు తప్పించుకోలేరంటూ మీడియా ముందు పదే పదే ఆరోపణలు చేస్తున్నారు. కాని లిక్కర్ స్కాం పై టిడిపి అధినేత చంద్రబాబు మాత్రం ఆ పార్టీ మంత్రులను మాట్లాడవద్దని క్యాబినెట్‌లో చెప్పడం కొసమెరుపు. బీజేపీ విమర్శలపై స్పందించని వైసీపీ నేతలు. మరోవైపు లిక్కర్ స్కాం పై బిజెపి పదే పదే ఆరోపణలు చేస్తున్నా వైసిపి మాత్రం స్పందించడం లేదు. వరుస అరెస్టులు జరుగుతుంటే టిడిపిని మాత్రం విమర్శిస్తున్నా బిజెపి జోలికి మాత్రం వెళ్లడం లేదు. దీంతో కమలనాధుల ఆరోపణలకు ప్రతిస్పందన లేకపోవడంతో బిజెపి, వైసిపి ఒక్కటే నంటూ గుసగుసలు వినబడుతూనే ఉన్నాయి. ఏదేమైనా ఆ ప్రచారానికి చెక్ పెట్టడానికి లిక్కర్ స్కాం తో పాటు ఇతర స్కాంలు, గతంలో జరిగిన పాలనపై వరుస పోరాటాలు చేయాలని, మాధవ్ తో సహా బిజెపి శ్రేణులు రాష్ట్రంలో ఎక్కడ పర్యటించినా బిగ్ బాస్ ను టార్గెట్ చేస్తూ అక్కడి మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులుగా పనిచేసిన వారిపై విమర్శలు గుప్పించాలని నిర్ణయించారట. ఈ నేపథ్యంలోనే వైసిపిపై బీజేపీ వర్గాలు ముప్పేట దాడి చేస్తున్నాయంట. చూడాలి మరి వైసిపి ని విమర్శించి ఏపీలో బలపడాలన్న బిజెపి ప్లాన్ సక్సెస్ అవుతుందా లేక బెడిసికొడుతుందా?

# టీడీపీ పుట్టిన తర్వాత? మొదటి సారి

**కడప – సూర్య వాస్తవం**

పులివెందులలో వైసీపీకి డిపాజిట్ గల్లంతు.. అసలు వినడానికి ఏమాత్రం నమ్మశక్యంగా లేని ఈ పరిణామం నిజంగానే జరిగింది. పులివెందులలో పసుపు జెండా ఎగిరింది. పూల అంగళ్లలో తెలుగు దేశం సంబరం చేసింది. జగన్ ప్రెస్‌మీట్ సాక్షిగా తెలుగుదేశం విజయం నిన్ననే ఖరారు అయిపోయినా.. ఇవాళ అధికారిక ఫలితాల్లో టీడీపీ జగన్ పార్టీని చిత్తు చిత్తు చేసింది. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ 6033 ఓట్ల మెజార్టీతో గెలుపొందింది. తెలుగుదేశం అభ్యర్థి బీటెక్ రవి భార్య, మారెడ్డి లతారెడ్డి 6716ఓట్లు పొందగా.. వైసీపీ అభ్యర్థి హేమంత్ రెడ్డి 683 ఓట్లు సాధించారు. 1978 నుంచి పులివెందుల నియోజకవర్గం వైఎస్ ఫ్యామిలీ అడ్డా. 78లో వైఎస్ రాజశేఖరరెడ్డి.. రెడ్డి కాంగ్రెస్ తరపున గెలిచినప్పటి నుంచి ఇప్పటి వరకూ 12 సార్లు పులివెందులకు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే అన్నిసార్లూ వైఎస్ కుటుంబ సభ్యులే గెలిచారు. వైఎస్, ఆయన భార్య విజయమ్మ, ఆయన సోదరుడు వివేకానందరెడ్డి, ఆయన కుమారుడు , మాజీ సీఎం జగన్ మోహనరెడ్డి గెలిచారు. 2019లో అక్కడ జగన్ మెజార్టీ 90వేల మార్క్‌ను కూడా దాటింది. దీనిని బట్టే ఆ కుటుంబానికి పులివెందులలో ఉన్న పట్టు అర్థం చేసుకోవచ్చు. 1983లో తెలుగుదేశం పుట్టిన దగ్గర నుంచి అక్కడ జెడ్పీ ఎన్నికల్లో టీడీపీ గెలవలేదు. 30ఏళ్లుగా పులివెందుల మండలంలో అసలు ఎన్నికలే జరగలేదు. వైసీపీ ఏకగ్రీవంగా గెలుస్తోంది. అలాంటి చోట వైసీపీని తెలుగుదేశం మట్టికరిపించింది. అసలు ఇవి ఎన్నికలే కాదు.. జరిగింది రిగ్గింగ్? అని వైఎస్సార్సీపీ ముందే రిజల్ట్ తేల్చేసింది. స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా ఉండటం కొత్త విషయమేం కాదు. మంత్రాంగంలో మందుంటారు. యంత్రాంగం వాళ్ల కంట్రోల్‌లో ఉంటుంది. ఇప్పుడూ అదే జరిగింది. ఏదైనా రిజల్ట్ అనేదే ఫైనల్ కాబట్టి ఈ ఎన్నికలో వైఎస్సార్సీపీని తెలుగుదేశం చావుదెబ్బ కొట్టినట్టే.. ఫస్ట్ టైమ్ జగన్ ఇలాకాలో ఆయన పార్టీని దెబ్బతీయడం నిజంగా టీడీపీకి పొలిటికల్‌గా పెద్ద మైలేజ్. పులివెందుల ఎన్నికలను టీడీపీ చాలా సీరియస్‌గా తీసుకుంది. మరో ఏడాదిలో జెడ్పీ పదవీకాలం పూర్తవుతుంది. మామూలుగా పదవి పూర్తైతేనే స్థానిక ఎన్నికలు చంద్రబాబు అంత తొందరగా నిర్వహించరు అనే పేరుంది. అలాంటిది తప్పుకుండా గెలిచి తీరతామన్న నమ్మకంతోనే? ఈ సారి వీళ్లు రంగంలోకి దిగారు. పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీటెక్ రవి భార్య లతారెడ్డినే అభ్యర్థిగా రంగంలోకి దించారు. జమ్మలమడగు నుంచి ఆదినారాయణ రెడ్డి మొత్తం



ఎన్నిక బాధ్యతను తనపై ఉంచుకుని పనిచేశారు. మంత్రి సవిత కూడా నియోజకవర్గంలోనే ఉండి గెలుపుకోసం ప్రయత్నాలు చేశారు. జగన్‌పై అగ్రెసివ్‌గా వెళ్లడం ద్వారా బీటెక్ రవి పులివెందులలో కొద్ది కొద్దిగా ఆదరణ పెంచుకుంటున్నారు. 2017 స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీటెక్ రవి.. వైఎస్ వివేకానందరెడ్డిపై గెలుపొందడం మొదటి మలుపు.. 2024లో రవి జగన్ మెజార్టీ తగ్గించడంలో సక్సెక్ అయ్యారు. 2024 ఎన్నికల్లో జగన్ మెహనరెడ్డి మెజార్టీ ఏకంగా 30వేలకు పైగా తగ్గింది. ఇప్పుడు తన భార్యను నించోబెట్టి ? తానే అభ్యర్థిగా మండలంలో తిరిగారు..వైనాట్ 175 పేరుతో కుప్పంను కూడా కొట్టేస్తామంటూ సాధారణ ఎన్నికలకు ముందు వైసీపీ చూపించిన అత్యుత్సాహం కూడా టీడీపీ శ్రేణులు ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవడానికి ఓ కారణం. అప్పట్లో కుప్పంలో నాలుగు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మునిసిపాలిటీలను కూడా గెలుచుకున్న ఊపులో వైసీపీ కుప్పం అసెంబ్లీ స్థానాన్ని కొడతామని చెప్పింది. దానికి పోటీగా చంద్రబాబు పులివెందుల వచ్చి వైనాట్ పులివెందుల అన్నారు. రెండు అసెంబ్లీల్లో రిజల్ట్ మారలేదు కానీ.. కుప్పం స్థానిక ఎన్నికల్లో జరిగిన పరాభవానికి టీడీపీ ప్రతీకారం తీర్చుకుంది. అది కూడా డిపాజిట్ రానంత రేంజ్‌లో వైసీపీని ఓడించింది. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు తానే ఎమ్మెల్సీగా గెలిచిన బీటెక్ రవి.. ఇప్పుడు మరోసారి తన భార్యను గెలిపించుకున్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

## - టెన్త్ 1973-74 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ప్రోత్సాహక వితరణ












**కదిరి – సూర్య వాస్తవం, ఆగస్టు 15:**

కదిరి వేమన బాలుర ఉన్నత పాఠశాలలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధానో పాధ్యాయులు లియాఖత్ అలీ ఖాన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో ఇదే పాఠశాల లో 1973-74 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు హాజరై, గత సంవత్సరం పదవ తరగతి లో ప్రతిభ కనపరచిన ఈ పాఠశాల విద్యార్థులకు ప్రోత్సా హక బహుమతులను అందజేశారు.

పూర్వ విద్యార్థులు అత్తార్ మహబూబ్ బాషా, ఎల్.రెడ్డి, ఎస్ఎండి. బాషా, కాటం వీరనారాయణ, టి రామలింగయ్య, సి.రమేష్ బాబు, కే.అజ్మతుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిధి గా పాల్గొన్నరు .కదిరి మున్సిపల్ ఛైర్ పర్సన్ కె.యస్. దిల్షాదున్నిసా చేతుల మీదుగా పూర్వ విద్యార్థులు కలిసి పాఠశాల లో ప్రథమ ర్యాంక్ సాధించిన విద్యార్థి ఆర్. నౌమాన్‌కు మెమెంటో, అయిదు వేల రూపాయలు ప్రోత్సాహక వితరణ అందజేశారు. ద్వితీయ ర్యాంక్ సాధించిన విద్యార్థి యస్. ఆతిఫ్‌కు మెమెంటో, మూడు వేల రూపాయలు ప్రోత్సాహక వితరణ, తృతీయ ర్యాంక్ సాధించిన విద్యార్థి యస్. అనిల్ కుమార్ నాయక్ కు మెమెంటో, రెండు వేల రూపాయలు ప్రోత్సాహక వితరణ అంద చేశారు. పూర్వ విద్యార్థి హాజీ అత్తార్ మహ బూబ్ బాషా మాట్లాడుతూ ... మా మిత్ర బృందం ఇకపై ప్రతి సంవత్సరం ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ఇదే విధమైన సత్కారం చేసి ప్రోత్సాహక వితరణ అందజేస్తాం. మేము అందించే ఈ చిరు వితరణ విద్యార్థులకు రాబోయే పరీక్షలలో మంచి మార్కులు సాధించాలని మా ప్రోత్సాహమే" అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లియాఖత్ అలీ ఖాన్ కి పూర్వ విద్యార్థుల బృందం శాలువ కప్పి పూలమాల తో సత్కరించారు. ఈ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కార్యక్రమం లో తెలుగు దేశం నాయకులు కె.యస్. బహావుద్దీన్ కదిరి మున్సిపల్ కౌన్సిలర్ లు, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, కదిరి పుర ప్రముఖులు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# జాతీయ పతాకాన్ని ఎగురవేసిన తులసి రెడ్డి




**వేంపల్లి - సూర్య వాస్తవం, ఆగస్టు 15:** 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి వేంపల్లి లో కాంగ్రెస్ కార్యాలయంలో, శ్లోకా హైస్కూలులో,లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో,నారాయణ విద్యా సంస్థలో జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ ప్రాచీన భారత దేశం ప్రపంచ దేశాలలో సమున్నత స్థానంలో ఉండేదన్నారు.అనైక్యత అనే ఒక్క కారణం చేత స్వాతంత్ర్యాన్ని కోల్పోయి కొన్ని శతాబ్దాల పాటు పరాయి పాలనలో దాస్య జీవితాన్ని గడిపి మన అస్థిత్వాన్ని పోగొట్టుకున్నామన్నారు. మహాత్మా గాంధీ లాంటి ఎందరో మహనీయుల పోరాటాలు,త్యాగాల ఫలితంగా 1947 ఆగష్టు 15 న స్వాతంత్ర్యం పొందాము. స్వాతంత్ర్యం వచ్చే నాటికి దుర్భర జీవితాన్ని గడిపేవారం. మన నాయకుల దార్శనికత కారణంగా ఈ 78 సంవత్సరాలలో అద్భుత ప్రగతి సాధించాం. ఇంకా సాధించవలసింది ఎంతో ఉంది. అది జరగాలంటే మనలో ఐక్యత ,దేశ భక్తి, జాతీయతా భావం ఉండాలి యని తులసి రెడ్డి ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీయుతులు డాక్టర్ సుబ్రమణ్యం, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామ కృష్ణ, వేముల మండల శాఖ అధ్యక్షుడు వెంకటేష్,అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, బద్రి, హన్సిక రెడ్డి,రవి, వినయ్, అయిచర్ రమణ ,శ్యాం ,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై రెపరెపలాడిన జాతీయ జెండా



**రాయచోటి-సూర్య వాస్తవం ఆగస్టు 15:** 1947 ఆగస్టు పదిహేనున భారతదేశం వందల ఏళ్ళ బానిసత్వాన్నుంచి విడుదలయిన రోజు అని డిసిసి జనరల్ సెక్రెటరీ అమీర్ అన్నారు. భారతదేశ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గాజులు భాస్కర్ ఆధ్వర్యంలో పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పై జెండా ఆవిర్భవించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జెండాకు గౌరవ వందనం చేసి జనగణమన అధినాయక జయహే అంటూ జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం మన జాతి యావత్తు తల ఎత్తుకొని జరుపుకునేలా ఎందరో త్యాగమూర్తుల పుణ్యఫలమే స్వాతంత్ర్య దినోత్సవం అన్నారు. భారత పౌరులు అందరూ నీతిగా, నిజాయితీగా సమైక్యతతో హింసను వదిలి గాంధేయ మార్గంలో నడవాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్, మహిళా నాయకురాలు నాగలత, స్వజనా రెడ్డీ, చెన్న కృష్ణ, మన్సూర్ అలీ ఖాన్, సింగం రామకృష్ణారెడ్డి, రియాజ్, రఫీ, ముబారక్, దర్బార్, నరేష్, ఈర్షద్ అలీ, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తాం...

**- ఎరుకల కాలనీ ప్రజలకు అనంత భరోసా...**



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం, ఆగస్టు 15:** ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని ఎరుకల కాలనీ వాసులకు అనంత వెంకటరామిరెడ్డి భరోసానిచ్చారు. శుక్రవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద 43వ డివిజన్ పరిధిలోని ఎరుకల కాలనీ వాసులు వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిను కలిశారు. గత యాభై సంవత్స రాలుగా ఇక్కడ నివాసం ఉంటున్నామని, ఇంటి పట్టాలతో పాటు, పన్నులు కూడా కడుతున్నా కూడా నగర పాలక సంస్థ అధికారులు ఇళ్లను కాళీ చేసి వెళ్లిపోవాలంటూ వందకు పైగా ఇళ్లకు నోటీసులు ఇస్తున్నారంటూ కాలనీ ప్రజలు అనంత వద్ద వాపోయారు. అధికారులు జారీచేసిన నోటీసులను అనంత వెంకట్రామిరెడ్డికి చూపించారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ ఎవ్వరూ అధైర్యపడకండి ప్రతి ఒక్కరికి అండగా నిలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దాం

**-జిల్లా ఎస్పీ పి.జగదీష్**




**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, ఆగస్టు 15:** దేశం కోసం పాటుపడిన స్వాతంత్ర్య సమ రయోధుల ఆశ యాలను స్ఫూర్తిగా చేసుకుని విధుల్లో పునరంకితమై ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దామని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పిలుపునిచ్చారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఆయన శుక్రవారం జిల్లా స్పెషల్ బ్రాంచి కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. సిబ్బందికి స్వీట్లు పంచి స్వాతంత్ర్య దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... బ్రిటీష్ దాస్యశృంఖలాల నుంచీ భారతావని స్వేచ్ఛావాయువులు పీల్చినప్పటి నుండీ నేటి వరకు ప్రపంచ దేశాలు మన దేశం వైపు చూసేలా అన్ని రంగాల్లో ఎదగడం జాతి యావత్తు గర్వించదగ్గ విషయమన్నారు. భిన్నత్వంలో ఏకత్వం సాధించిన ఘనత మనకే దక్కుతుందన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరులను గుర్తు చేసుకుని... వారి ఆశయాలను ఆదర్శంగా చేసుకుని విధుల్లో నిర్వహిద్దామన్నారు. దేశభక్తి భావాన్ని చాటుతూ భావితరాలు ఆ దిశగా నడిచేలా సమిష్టి కృషి చేద్దామన్నారు. ఈకార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి సి.ఐ లు ధరణీకిశోర్, క్రాంతికుమార్, ఎస్సైలు లోకనాథ్ చౌదరి, వెంకటక్రిష్ణ, షఫీ మరియు జిల్లా స్పెషల్ బ్రాంచి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ అంటేనే మహిళల పక్షపాతి

**- ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్రీరామ్**

**రాప్తాడు - సూర్య వాస్తవం, ఆగస్టు 15 :** తెలుగుదేశం పార్టీ అంటేనే మహిళా పక్షపాతి అనేది స్త్రీ శక్తి పథకం ద్వారా అది మరోసారి నిరూపితమైందని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ హిందూపురం ఎంపీ పార్థసారథి అన్నారు. ధర్మవరంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించే స్త్రీ శక్తి పథకం పండుగ వాతావరణంలో ప్రారంభమైంది.ఎంపీ పార్థసారథితో కలిసి శ్రీరామ్ ఈ పథకాన్ని ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ప్రారంభించారు.మహిళలు ప్రయాణించే బస్సును జెండా ఊపి ప్రారంభించారు.మహిళలతో కలిసి శ్రీరామ్ ఎంపీ పార్థసారథి ప్రయాణించారు.మహిళల స్పందనను శ్రీరామ్ తెలుసుకున్నారు.ఈ సంధర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ఆ రోజు ఆస్తిలో సమాన హక్కు కల్పించింది తెలుగుదేశంపార్టీ అని అదే స్ఫూర్తితో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళల పక్షాన నిలబడ్డారని అన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో కూడా మహిళలకు పెద్ద పీట వేశారన్నారు.ఇప్పటికే ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నారు.తల్లికి వందం ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ ఇచ్చారు.ఇప్పుడు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించారు. మహిళలు ఇప్పుడు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చు.దీనిని మహిళలు సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ధర్మవరం చేనేతలకు ఉపయోగపడే విధంగా ఉచిత విద్యుత్ తో పాటు మగ్గం నేసే ప్రతి చేనేతకు రూ.25000 ఆర్థిక సాయం త్వరలో అందుతుందన్నారు. మరోవైపు ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నా ముఖ్యమంత్రి అన్ని పథకాలు అమలు చేస్తున్నారన్నారు.ఇప్పుడు స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఎక్కడికైనా ప్రయాణించవచ్చున్నారు. ఒక వైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్నారన్నారు.




# సమాచార శాఖ ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా కోటప్ప

**- స్వాతంత్ర్య దినోత్సవ వేదికపై రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం**



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, ఆగస్టు 15:** అనంతపురంలో సమాచార, పౌర సంబంధ శాఖ(డీ.పీ.ఆర్.ఓ) కార్యాలయ ఫోటోగ్రాఫర్ కె.కోటి(కోటప్ప)కి జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు లభించింది. అనంతపురం పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేదికపై రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా కోటి అవార్డు అందుకున్నారు. ఇంచార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సమక్షంలో కోటి అవార్డు అందుకున్నారు. కళ్యాణదుర్గం మండలం మల్లాపురం గ్రామానికి చెందిన కోటి..2004వ సంవత్సరంలో సమాచార శాఖలో ఫోటో గ్రాఫర్‌గా చేరారు. అప్పటి నుంచి వివిధ ప్రభుత్వాల్లో ఆరుగురు మంత్రులు, 12 మంది కలెక్టర్ల వద్ద ఫోటోగ్రాఫర్‌గా చేరి సమర్థవంతంగా సేవలందించి వారి అభిమానాన్ని చూరగొన్నారు. కోటి తీసిన ఫొటోలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆలోచింపజేస్తాయి. ఇప్పుడు ఆయనకు అవార్డు రావడంతో అన్ని శాఖల వారు అభినందనలు తెలిపారు.

# జయచంద్రారెడ్డి ఐ.శంకర్ వర్గీయుల మధ్య భగ్గుమన్న విభేదాలు

**- అవికే నాయక్ తండా సర్పంచ్ నటరాజ నాయక్..**

**- తంబళ్లపల్లె నియోజకవర్గ ఐటీడీపీ సోషల్ మీడియా కన్వీనర్ సాగర్లపై మదనపల్లెలో ప్రత్యర్థులు కర్రలు, రాడ్లతో విచక్షణా రహితంగా దాడి**

**- టీడీపీ నాయకుల మధ్య ఘర్షణ తలెత్తడంతో మదనపల్లెలో తీవ్ర కలకలం**





**మదనపల్లె - సూర్య వాస్తవం, ఆగస్టు 15 :** అన్నమయ్య జిల్లాలోని తంబళ్లపల్లె టిడిపిలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ వర్గీయులపై ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి జయచంద్రా రెడ్డి వర్గీయులు శుక్రవారం సాయంత్రం ఆ పార్టీ సర్పంచి, ఐటీడిపి నాయకులపై మదనపల్లెలో దాడి చేయడం వెలుగులోకి వచ్చింది. ఈ దాడి మదనపల్లె మండలంలోని బెంగుళూరు రోడ్డు చిప్పిలి వద్ద జరిగడంతో ఓ వర్గం దాడిలో గాయపడి బాదితులను స్థానిక జిల్లా ఆస్పత్రిలో చేరారు.బాదిలు తెలిపిన వివరాల మేరకు.. పెద్దమండెం మండలం, అవికే నాయక్ తండాకు చెందిన ఆ గ్రామ టీడీపీ సర్పంచ్ నటరాజ్ నాయక్(30), ములకల చెరువు మండలం, మద్దినాయునిపల్లె పంచాయతీ, నాయునివారిపల్లెకు చెందిన తంబళ్లపల్లి నియోజకవర్గ ఐటిడిపి సోషల్ మీడియా కన్వీనర్ సాగర్ లు సొంత పనిమీద బైకులో మదనపల్లె బెంగళూరు రోడ్డుకు వచ్చారు. వీరిని గమనించిన జయచంద్రారెడ్డి వర్గీయులు కొందరు కర్రలు ఇనుప రాడ్లు తీసుకొచ్చి మూకుమ్మడిగా దాడి చేశారని బాదితులు ఆరోపించారు. ప్రత్యర్థుల దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితులను స్థానికులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందు తున్నారు. ఘటనపై తాలూక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు మరిన్ని వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

# సచివాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ



**కళ్యాణదుర్గం - సూర్య వాస్తవం, ఆగస్టు 15:** కళ్యాణదుర్గం స్థానిక 10వ సచివాలయంలోని 21వ వార్డు అధ్యక్షుడు బేరీల నాగరాజు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది అధ్యక్షతన సీనియర్ నాయకులు కో ఆప్షన్ మెంబర్ అన్వర్ భాష మరియు డిష్ ప్రభాకర్ ఉపాధ్యక్షుడు నాగేంద్ర జనరల్ సెక్రెటరీ వెంకటేశులు తెలుగుదేశం నాయకులు కుమ్మరి చంద్ర అడ్మిన్ చంద్రశేఖర్ నాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొని జెండా ఆవిష్కరించారు 21 వ వార్డు అధ్యక్షుడు బెరీల నాగరాజు మాట్లాడుతూ..... లిఅందరికీ 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు.. తెలుపుతూ... ఎందరో యోధుల ప్రాణత్యాగ ఫలితమే ఈ స్వాతంత్ర్యం. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛను కాపాడుకోవడం మనందరి బాధ్యత. గత వీరుల త్యాగాలను స్మరించుకొని.. భారత దేశ సర్వతోమా అభివృద్ధి కోసం ప్రతి ఒక్క భారతీయుడు పాటుపడాలని అన్నారు.. ఈ కార్యక్రమంలో వార్డు పరిధిలోని టిడిపి నాయకులు ప్రజలు పాల్గొని మిఠాయిలు అందించారు.

# ఎందరో వీరుల త్యాగఫలమే మనకు స్వాతంత్ర్యం

**- మువెన్నెల జెండాను ఎగురవేసిన చాగి మల్లికార్జున రెడ్డి**





**ఆదోని - సూర్య వాస్తవం, ఆగస్టు 15:** ఆదోని పట్టణంలో ఎన్ రామయ్య మున్సిపల్ స్కూల్ కు చాగి మల్లికార్జున రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అనంతరం 79వ స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మువ్వెన్నల జెండాను ఆవిష్కరి ంచాడు.. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థి విద్యార్థినిలకు బహుమతులు అందజేశారు.. అనంతరం చాగి మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధుల ప్రాణ త్యాగాలు ప్రతిఫలమే మనకు స్వతంత్రం వచ్చిందన్నారు. నేటి బాలురలే రేపటి పౌరులని అన్నారు. దాదాపు 200 సంవత్సరాల బ్రిటిష్ వలస పాలనకు చరమగీతం పాడాము. ప్రతి ఒక్కరు కూడా దేశ సమగ్రతను కాపాడి దేశ గౌరవాన్ని పెంచాలన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విన్నపం మేరకు పాఠశాల అభివృద్ధికి 20 ట్రిప్పులు ఎర్రమట్టి తోలిస్తానని, తన వంతుగా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అలాగే పాఠశాల అభివృద్ధి కొరకు తన వంతుగా అధికారుల సమన్వయం చేసుకొని అవసరమైతే కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుతో మాట్లాడి పాఠశాల కోసం మరిన్ని నిధులు తీసుకొని వస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎంసి రంగస్వామి, ఉపాధ్యాయులు విష్ణు, అయ్య రాజు, ఎస్ఎంసిబి.చైర్మన్ శ్వేత, కౌన్సిలర్, సోదరుడు గోవింద రాజులు, అక్బర్, స్కూల్ యాజమాన్యం విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదింట విద్యా వెలుగులు నింపిన సూర్యుడు రవీంద్ర



**రాప్తాడు–సూర్య వాస్తవం, ఆగస్టు 15:** మారుమూల ప్రాంతానికి గురుకుల పాఠశాలను తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి స్వర్గీయ పరిటాల రవీంద్ర అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండలం పేరూరు ప్రభుత్వ ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యేకు విద్యార్థులు ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఎమ్మెల్యే స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతకాన్ని ఆవిష్కరించి జాతీయ వందనం చేశారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. స్వాతంత్ర సమరయోధుల వేషదారణలో ఉన్న చిన్నారులను ఎమ్మెల్యే సునీత ప్రత్యేకంగా అభిన ందించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే సునీతతో పాటు సీఐ శ్రీధర్ విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. జెండా ఆవిష్కరణ ఎలా చేయాలి.జెండా రంగులు ఎవరు రూపకల్పన చేశారు. అయన జన్మించిన రాష్టం.జిల్లా గురించి ఆగష్టు 15న జెండా ఎవరు ఎగురవేస్తారు వంటి ప్రశ్నలు అడిగారు. వీటిలో సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థిని విద్యార్థులకు సీఐ శ్రీధర్ బహుమతులు అందజేశారు.అలాగే ఎమ్మెల్యే సునీత పాఠశాల అభివృద్ధికి రూ.1లక్ష విరాళం ప్రకటించారు. సీఐ శ్రీధర్ తో పాటు స్థానిక టీడీపీ నాయకులు మండల నాయకులు రూ.10 నుంచి రూ.20వేలు చొప్పున విరాళాలు ప్రకటించారు. మొత్తం రూ.4.50లక్షలు విరాళంగా అందజేశారు. విరా ళాలు ఇచ్చిన ప్రతి ఒక్కరిని ఎమ్మెల్యే సునీత అభినందించారు. ఒకప్పుడు ఈప్రాంతం వాళ్ళు చదువు కోవాలంటూ సుదూర ప్రాంతాలకు వెళ్ళవలసి వచ్చేదన్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అప్పటి మంత్రి పరిటాల రవీంద్ర చొరవ తీసుకుని గురుకుల పాఠశాల వచ్చేలా చేశారన్నారు.ఎంతో మంది పేదల ఇంట విద్యా వెలుగులు పంచిన వ్యక్తి పరిటాల రవి అన్నారు.ఆ రోజు ఈ పాఠశాల తీసుకు రావడం వలనే వేల మంది విద్యార్థులకు భవిష్యత్ ను ఇచ్చామన్నారు. రామగిరి ప్రాంతానికి తాను కూడా బాలికల గురుకుల పాఠశాల తీసుకొచ్చానన్నారు. ఈరెండు పాఠశాలల అభివృద్ధికి ఎంతో మంది సహకరించా రన్నారు. స్వాతంత్ర దినోత్సవం రోజున మీ పాఠశాల అభివృద్ధికి దోహదపడిన వాళ్ళను గుర్తు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు.పిల్లలు చిన్నప్పటి నుంచి దేశ భక్తి క్రమశిక్షణ అలవరుచుకోవాలని సూచించారు. సెల్ ఫోన్లకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలన్నారు. రేపు మీరు చదివిన పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని తెలియజేశారు.

## అనంతపురం శిల్పారామంలో నేడు కృష్ణాష్టమి వేడుకలు ...

**- శిల్పారామం పరిపాలన అధికారి పి.శివ ప్రసాద్ రెడ్డి**



**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం, ఆగస్టు 15:** అనంతపురం శిల్పారామంలో ఈ నెల 16న కృష్ణాష్టమి పండుగ సందర్భంగా సాయంత్రం కృష్ణుడి బాల్యాన్ని గుర్తుచేసుకుంటూ, ఉట్టిని కొట్టే సంప్రదాయ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మని పరిపాలనాధికారి పి.శివ ప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శాస్త్రీయ, జానపదం నృత్యములను నిర్వహి స్తున్నా మన్నారు. కావున ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న రాయచోటి తహశీల్దార్



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం, ఆగస్టు 15 :** రవాణా యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మరియు అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి జాయింట్ కలెక్టర్ల చేతిలో మీదుగా శుక్రవారం రాయచోటి తాసిల్దార్ నరసింహా కుమార్ అవార్డు తీసుకోవడం జరిగింది. ఆగస్టు 15 సందర్భంగా పోలీసు పెరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు ఆయన పలు సంక్షేమ అభివృద్ధి పథకాల శ కటాలను, సాంస్కృతిక కార్యక్రమాలను తి లకించారు.

# జాప్ నగర అధ్యక్షులుగా సీనియర్ జర్నలిస్ట్ చెరుకూరి రామాంజనేయులు

**- ఏకగ్రీవ ఎంపికపై పలువురు సీనియర్ జర్నలిస్టుల హర్షం**

**- ఎంపిక పట్ల రాష్ట్ర, జిల్లా కమిటీకి కృతజ్ఞతలు**




**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, ఆగస్టు 15:** జర్నలిజం వృత్తిలో గత 19 సంవత్సరాలుగా ఎనలేని సేవలు అందించిన చెరుకూరి రామాంజనేయులు ను జాప్ రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు శుక్రవారం గుర్తించి జాప్ అసోసియేషన్ నిర్ణయం మేరకు నగర అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రెస్ క్లబ్ లో జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తపల్లి అనిల్ కుమార్ రెడ్డి, జాప్ జిల్లా అధ్యక్షుడు బండి భాస్కర్ రెడ్డిలు నూతనంగా ఎంపికైన రామాంజనేయులకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు మాట్లాడుతూ...అనంతనగరంలో జర్నలిస్టులు ఎదుర్కొ ంటున్న సమస్యలపై శక్తివంచన లేకుండా పోరాటాలు చేస్తానని, నగర జర్నలిస్టు అభివృద్ధి కోసం, వారి సంక్షేమం కోసం రేయి పగలు పాటుపడతానని, జాప్ లో సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి జాప్ అసోసియేషన్ నుండి పూర్తి అండదండగా నిలిచి అన్ని విధాల అందుబాటులో ఉంటామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఎక్కడైనా అన్యాయంగా జర్నలిస్టులపై దాడులు జరిగిన వారికి జాప్ ఎప్పుడూ అండదండగా ఉంటుందని తెలియజేస్తున్నాము. ప్రభుత్వం నుండి అందే ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అందేందుకు జాప్ తరఫున కృషి చేస్తామని తెలియజేస్తున్నాము. నగర అధ్యక్షునితో పాటు నగర ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున, కార్యదర్శిగా కుంచపు భాస్కర్, సహాయ కార్యదర్శిగా ఎనుముల కుల్లాయప్ప, కోశాధికారిగా సీ. హరికృష్ణ లను ఎంపిక చేశారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎన్డీఏ ప్రభుత్వం

**- డీసీఎంస్ ఛైర్మన్ వై.నాగేశ్వరరావు**



**డోన్ –సూర్య వాస్తవం, ఆగస్టు 15:** కర్నూలు బస్టాండ్‌లో సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా నేడు స్త్రీ శక్తి పథకం నేడు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మినిస్టర్ టీ.జి. భరత్, ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కలెక్టర్ రంజిత్ బాషా, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డీసీఎంస్ చైర్మన్ నాగేశ్వరరావు పాల్గొని, ప్రారంభోత్సవం చేయడం జరిగింది. నేటి నుండి మహిళలు రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచిత ప్రయాణం చేయవచ్చు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ప్రెస్ బస్సులో ప్రయాణం చేయవొచ్చు. మహిళలు పుణ్యక్షేత్రాలు దర్శించుకోవచ్చు. ఉద్యగస్తులు, విద్యార్థులు కూడా ఈ సదుపాయాన్ని వినియోగించు కోవచ్చునని ఈ సందర్భంగా తెలియజేసారు.

# మోడల్ డీఎస్సీ నిర్వహణ మెగా హిట్

**- అనంతపురం ఎంపీ అంబికా జి.లక్ష్మీనారాయణ**




**పామిడి – సూర్య వాస్తవం, ఆగస్టు 15 :** అనంతపురం జిల్లా కేంద్రంలో అనంతపురం ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ డీఎస్సీ పరీక్షలో మొదటి పది ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబిక జి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక వరం లా మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి తన మొదటి సంతకం హామీని నెరవేర్చారు నిరుద్యోగ యువతను ప్రోత్సహించడంలో తెలుగుదేశం ప్రభుత్వం ఎల్లవేళలా ముందు ఉంటుందని అలాగే అనంతపురం జిల్లాలో ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంస్థ పెద్ద ఎత్తున మోడల్ డీఎస్సీ పరీక్షను చాలా పగడ్బందీగా నిర్వహించిన తీరు అభినందనీయమని, అలాగే అత్యున్నత ప్రతిభను కనబరిచిన అభ్యర్థులకు చెక్కులను పంపిణీ చేసినందుకు గాను సంస్థ సభ్యులను ప్రత్యేకంగా అభినందిస్తూ, సామాజిక దృక్పథంతో స్వచ్ఛంద సంస్థ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని భవిష్యత్తులో కూడా ఎస్సార్ ఎడ్యుకేషనల్ సంస్థ ఎన్నో సామాజిక కార్యక్రమాలకు తన వంతు సహకారాన్ని జిల్లా ప్రజలకు అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు సుంకర రమేష్ మాట్లాడుతూ మా సంస్థ ఆధ్వర్యంలో మే నెల 24 తేదీన జరిగిన మోడల్ డీఎస్సీ పరీక్ష నిర్వహించామని ఇందులో పెద్ద ఎత్తున డిఎస్సీ అభ్యర్థులు పాల్గొని విజయవంతం చేశారని ఆ అభ్యర్థుల మొదటి పది ర్యాంకులకు ఈరోజు గౌరవ అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ గారి చేతులమీదుగా బహుమతులను ప్రధానం చేసినందుకు ఆయనకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తూ రాబోయే రోజుల్లో మా సంస్థ ద్వారా అనేక సామాజిక సేవ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ చైర్మన్ దీప్ కిరణ్ రెడ్డి, కార్యదర్శి రాయల్ రంగ, సహాయ కార్యదర్శి నాగ శివ, సభ్యులు కుమార్, గాయత్రి, మహేంద్రధోని తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ప్రొఫెసర్ రాజేష్

**- వీర జవాన్ కుటుంబానికి లక్ష రూపాయలు ఆర్థిక సాయం**



**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, ఆగస్టు 15:** దేశ రక్షణ నేపథ్యంలో జమ్మూకాశ్మీర్ సరిహద్దులో వీరజవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జవాన్ మురళీ నాయక్ ప్రొఫెసర్ రాజేష్ మురళి పిల్లల కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్ కోసం రూ.1,00,000 అందజేశారు. వీర జవాన్ కుటుంబానికి రాజేష్ ధైర్యం చెప్పారు. మురళి నాయక్ చేసిన త్యాగానికి దేశం రుణపడి ఉంటుందని వ్యాఖ్యానించారు.

## ఇది కూటమి ప్రభుత్వ ఘన విజయం



**రాప్తాడు – సూర్య వాస్తవం, ఆగస్టు 15 :** మహిళలకు వరాల జల్లు కురిపిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వ హయాంలో ఘనమైన విజయం సాధించామని మండల కన్వీనర్ పంపు కొండప్ప కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు తెలియజేశారు. రాప్తాడు మండలం బండమీదపల్లి గ్రామంలో ప్రభుత్వ ఆర్టీసీ బస్సుకి తోరణాలు కట్టి పసుపు కుంకుమలు పెట్టి పూల మాలలతో అలంకరించి ఉచిత బస్సు ప్రయాణం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. మండలంలోని మహిళలు ఆనందంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గంగులకుంట క్రిష్ట రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్రాముడు మరూరు సింగల్ విండో అధ్యక్షులు గోపాల్ సర్పంచులు తిరుపాల్ నరేష్ సోమర నారాయణస్వామి మాజీ కన్వీనర్ సాకే నారాయణ స్వామి సాకే జయరాముడు ముత్యాలప్ప చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# త్యాగధనుల పోరాటఫలం స్వతంత్ర దినం

**- పత్తికొండ గురుకుల పాఠశాలలో జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే కే.ఈ.శ్యామ్ కుమార్**



**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం, ఆగస్టు 15:** సమరయోధుల పోరాటపలం మన స్వతంత్ర దినం గొప్పదనం అని ఎమ్మెల్యే కె.శ్యాంబాబు అన్నారు. 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా శుక్రవారం పత్తికొండ బాలికల గురుకుల పాఠశాలలో ఆయన జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నాటి యోధుల చరిత్రను మనం ఎప్పుడు గుర్తించుకోవాలన్నారు. నేటి విద్యార్థులే రేపటి దేశభవితకు వారసులని ప్రతి విద్యార్థి ఉత్తమ లక్ష్యంతో ముందుకు సాగి మంచి ఫలితాలు సాధించాలన్నారు. పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు ఆయన సొంత ఖర్చులతో లాప్టాప్‌ను అందించారు. క్రీడల్లో ప్రతిభ చూపిన బాలికలను ఆయన అభినం దించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విన్యాసాలు ఆయన తిలకించారు. విద్యతోపాటు, క్రీడలు వివిధ పోటీలలో ప్రతిభ చూపే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యా యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భరత్ నాయక్ సిఐ జయన్న, వెంకటపతి, బత్తిన లోకనాథ్ రామానాయుడు, ప్రమోద్ కుమార్ రెడ్డి, తిమ్మయ్య చౌదరి, ఆవరపు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన స్త్రీ శక్తి పథకం

- మహిళలకు ఉచిత టికెట్ ఇచ్చి బస్సు నడిపిన బాలయ్య
- 79వ స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ





**హిందూపురం – సూర్య వాస్తవం, ఆగస్టు 15 :** ఆ రోజు ఆస్తిలో సమానహక్కు. ఈరోజు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం. తెలుగుదేశం పార్టీ అంటేనే మహిళా పక్షపాతి అని స్త్రీ శక్తి పథకం ద్వారా అది మరోసారి నిరూపితమైందని హిందూపురం ఎమ్మెల్యే పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ తెలియజేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించే స్త్రీ శక్తి పథకం పండుగ వాతావరణంలో ప్రారంభమైంది. ఈ పథకాన్ని ఆర్టీసీ బస్టాండ్ నుండి బాలయ్య బాబు ఇంటి వరకు తనే డ్రైవర్గా నడిపి శ్రీ శక్తి పథకాన్ని ప్రారంభించిన బాలయ్య మహిళల స్పందనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆ రోజు ఆస్తిలో సమాన హక్కు కల్పించింది తెలుగుదేశంపార్టీ అని.అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళా పక్షాన నిలబడుతున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో కూడా మహిళలకు పెద్ద పీఠ వేశారన్నారు. ఇప్పటికే ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తు న్నారని, తల్లికి వందం ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ ఇచ్చారని.. ఇప్పుడు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించారన్నారు. ఇది పని చేసే మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయ పడ్డారు. కూలీ పనులకు వెళ్లే వారు, చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకునే వారు బస్సుల్లో వెళ్లా లంటే గతంలో డబ్బు ఖర్చు చేసే వారని.. ఇప్పుడు అలాంటి అవసరం ఉండదన్నారు. మహిళలు ఇప్పుడు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చన్నారు. దీనిని అంతా సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు మరోవైపు రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నా. ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని పథకాలు అమలు చేస్తున్నా రన్నారు. వైసీపీ నాయకులు విమర్శలు చేయడంపై ఆయన తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు వ్యవస్థల్ని నాశనం చేసి అప్పులు పెట్టి వెళ్లినా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఓ వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్నారన్నారు.

- చిత్తూరులో స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించిన మంత్రి సత్య కుమార్ యాదవ్
- వేడుకల్లో పాల్గొన్న చిత్తూరు ఎంపీ దగ్గు మళ్ళ ప్రసాదరావు



**చిత్తూరు – సూర్య వాస్తవం, ఆగస్టు 15:** జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ లో శుక్రవారం సాయంత్రం స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ కార్యక్రమాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రారంభించారు. అనంతరం బస్సులో మంత్రి, చిత్తూరు ఎంపీ దగ్గు మళ్ళ ప్రసాద రావు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌లు బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని సుమారు 2.6 కోట్ల మంది మహిళలు ఆడపిల్లలు ట్రాన్స్ జెండర్లకు ఐదు రకాల ఆర్టీసీ బస్ సర్వీసులో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అముద, చుడా చైర్ పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్ పలువురు ఆర్టీసీ అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి పథకం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న
- మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి - సీడ్స్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి



**డోన్- సూర్య వాస్తవం,ఆగస్టు 15:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న సూపర్ సీక్స్ లోని స్త్రీ శక్తి పథకం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నంద్యాల లో ఆర్టీసీ నందు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి బి.సి.జనార్దన్ రెడ్డి , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి , నంద్యాల జిల్లా కలెక్టర్ రాజా కుమారి గణియా ఐఏఎస్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ఎండి.ఫిరోజ్ జాయింట్ కలెక్టర్



విష్ణు చరణ్ ఈ సందర్భంగా మంత్రి బి.సి.జనార్దన్ రెడ్డి,సీడ్స్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరులుగా ఉన్న బాలికలు, మహిళలు, ట్రాన్స్ జెండర్స్ ఉచిత బస్సు ప్రయాణం చేయవచ్చని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా ఉచిత ప్రయాణం చేయవచ్చన్నారు. ఐదు రకాల బస్సులు పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్ , మెట్రో ఎక్స్ప్రెస్, ఆర్డినరీ సిటీ బస్సులు ఇవ్వడం జరిగిందని. ప్రయాణించేవారు ఆధార్,ఓటర్ ఐడి, రేషన్ కార్డులు మొదలగునవి ఏదైనా ఒక గుర్తింపు కార్డు చూపించాలని అన్నారు.

## రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు





**రాప్తాడు – సూర్య వాస్తవం, ఆగస్టు 15 :** ఇక నుంచి రాష్ట్రంలో మహిళలు ఎక్కడికి వెళ్లాలన్నా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు మహిళా లోకానికి ఇచ్చిన గొప్ప కానుక అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. రామగిరి మండలం వెంకటా పురంలో స్త్రీ శక్తి పథకంను ఎమ్మెల్యే పరిటాల సునీత టిడిపి నాయకులతో కలిసి ప్రారంభించారు.బస్సులకు అరటి పిలకలు కొబ్బరి మట్టలు మామిడి తోరణాలు పూలు కట్టి ఒక పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి బస్సులో ఉచితంగా ప్రయాణించారు. ఎమ్మెల్యే సునీత స్వయంగా మహిళలతో కలిసి బస్సులో వెంకటాపురం నుంచి నసనకోట గంగంపల్లి మీదుగా తిరుమల దేవర దేవస్థానం వరకు ప్రయాణం చేశారు. దారి వెంబడి మహిళలు బస్సులకు స్వాగతం పలుకుతూ డప్పులు కొడుతూ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ మహిళలోకానికి ఇది మంచి సువర్ణ అవకాశం అని అన్నారు. గతంలో మహిళలు ఎక్కడికి వెళ్లాలన్నా ఆర్థికంగా ఇబ్బందులు పడే వాళ్లు. ప్రతిరోజు కూలి పనికి వెళ్లే మహిళలు తమకు వచ్చే డబ్బులో కొంత రవాణా ఛార్జీలకు ఖర్చు పెట్టేవాళు ్ళ. ఇకనుంచి మహిళలు ఎక్కడికి వెళ్లాలన్నా ఉచితంగానే ప్రయాణించవచ్చన్నారు. తమ పుట్టింటికి వెళ్లాలన్నా లేదా పుణ్యక్షేత్రాలకు వెళ్లాలన్నా సంతోషంగా బస్సులో వెళ్ళవచ్చన్నారు. ఎన్నికల ముందు తాము ప్రతి ఇంటికి తిరిగి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చామని ఇచ్చిన మాట ప్రకారం అది నెరవేర్చామన్నారు. ఇప్పటికే తల్లికి వందనం ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ ద్వారా మహిళలకు ఆర్థికంగా చేయూతను అందించామన్నారు. ఇప్పుడు ఉచిత బస్సు ప్రయాణం వలన కూడా మహిళలకు మేలు చేకూర్చామన్నారు. రాప్తాడు నియోజక వర్గ మహిళల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.

## ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిన ఎమ్మెల్యే కందికుంట

**కదిరి –సూర్య వాస్తవం ,ఆగస్టు 15:**గత ఎన్నికలలో భాగంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలలో సూపర్ సిక్స్ భాగంగాసూపర్ సిక్స్ నుంచి మరో సిక్సర్.. ఉచిత బస్సు ప్రయాణం స్త్రీశక్తి పథకం ప్రారంభించి మొదటి టికెట్టును కొనుగోలు చేసిన కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం కదిరి ఆర్టీసీ బస్టాండ్ లో స్త్రీ శక్తి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కార్యక్రమంలో భాగంగా వాహన పూజ కార్యక్రమం మహిళలతో మాటామంతీ జరిపి,మహిళలకు పెద్దపీట వేసి ఆదరించి వ్యాఖ్యానించారు ,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పరిగెత్తిస్తూ అలాగే సంక్షేమ పథకాలని ప్రజలకు అందజేస్తూ నాడు ఇచ్చిన హామీలలో సూపర్ సిక్స్ లో భాగంగా మరొక సూపర్ హిట్ కొట్టారని ప్రశంసించారు రాష్ట్రవ్యాప్తంగా మహిళా మణులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు, రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజల్లోకి చేరే విధంగా రూపకల్పన చేస్తున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జీ భైరవ ప్రసాద్, బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి గారు, టీడీపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పి వి పవన్ కుమార్ రెడ్డి,పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్,చైర్మెన్ దిల్షాద్ ఉన్నీసా,మహిళా నాయకురాలు మాజీ మహిళ కమిషన్ సభ్యురాలు పర్వీన్ బాను,తదితరులు కూటమి నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు



## ఏపీ పోలీసులపై ఫిర్యాదులకు కంప్లైంట్స్ అథారిటీ ఏర్పాటు



**అమరావతి – సూర్య వాస్తవం, ఆగస్టు 15:**రాష్ట్రంలోని పోలీసులపై వచ్చే ఫిర్యాదులను తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ కంప్లైంట్స్ అథారిటీని ఏర్పాటు చేసింది. పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యులుగా ముగ్గురు రిటైర్డు ఐఎఎస్, ఐపిఎస్ అధికారులను నియమిస్తూ నిర్ణయం తీసుకుంది.అథారిటీ సభ్యులుగా రిటైర్డు ఐఎఎస్ ఉదయలక్ష్మి, రిటైర్డు ఐపిఎస్ అధికారులు కెవిబి గోపాలరావు,బత్తిన శ్రీనివాసులును ప్రభుత్వం నియమించింది. వీరు పోలీసులపై వచ్చే ఫిర్యాదులను నమోదు చేసుకుని విచారణ చేస్తారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు విశాఖపట్నం,కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాలకు రాజమండ్రి, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు గుంటూరు, రాయలసీమ జిల్లాలకు కర్నూలు కేంద్రంగా కమిటీలను ఏర్పాటు చేసింది.ప్రతి కేంద్రంలో ముగ్గురు రిటైర్డు డిఎస్పి,అడిషనల్ ఎస్పి స్థాయి అధికారులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## చేనేత కుటుంబాలకు సాయం



**రాప్తాడు– సూర్య వాస్తవం, ఆగస్టు 15:** గత ఏడు రోజులుగా ధర్మవరం ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలైన ఇందిరమ్మ కాలనీ సత్యసాయి నగర్ లో చేనేత కుటుంబాల ఇళ్లలోకి నీరు చేరి తీవ్రంగా నష్టపోయిన విషయం తెలిసిందే.. ప్రభుత్వం నుండి అందే ఆర్థిక సాయం కొంత మేరకు ఆలస్యం కావచ్చనే భావనతో ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ హిందూపురం ఎంపీ బికె పార్థసారథి 50 చేనేత కుటుంబాలకు తాత్కాలిక భృతి కింద ఒక్కొక్కరికి 10 కేజీల బియ్యం అందజేశారు.అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన చేనేత కుటుంబాలకు అండగా ఉంటామని ప్రభుత్వం నుండి రావలసిన ఆర్థిక సహాయాన్ని త్వరగా వచ్చే విధంగా కృషి చేస్తామని తెలియజేశారు.

## ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలి

- ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ గ్రౌండ్‌లో రెపరెపలాడిన మువ్వన్నెల జెండా
- రిటైర్డ్ ఆర్ట్స్ కాలేజ్ లెక్చరర్ రామకృష్ణారెడ్డి, రామకృష్ణ (ఆర్కే)



**అనంతపురం –సూర్య వాస్తవం, ఆగస్టు 15:** అనంతపురం పట్టణంలోని స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ గ్రౌండ్‌లో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గ్రీన్ ట్రీ, గ్రౌండ్ వాకర్స్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాలేజ్ ప్రిన్సిపల్ హాజరయ్యారు. ఆర్ట్స్ కాలేజ్ రిటైర్డ్ లెక్చరర్ రామకృష్ణారెడ్డి, రామకృష్ణ (ఆర్కే) , ఎర్రి స్వామి, గ్రీన్ ట్రీ సభ్యుల ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అలాగే స్వాతంత్ర్య సమర యోధుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సంద ర్భంగా రామకృష్ణారెడ్డి, రామకృష్ణ (ఆర్కే) మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలన్నారు. దేశాభివృద్ధికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల గురించి ప్రతిఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధికోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ట్రీ సభ్యులు, ఆర్ట్స్ కాలేజ్ బార్ వాకర్స్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పెయింటర్‌కు తీవ్ర గాయాలు



**మదనపల్లె – సూర్య వాస్తవం, ఆగస్టు 15 :** బైకు అదుపు తప్పి పడి ఓ పెయింటర్ తీవ్రంగా గాయ పడ్డాడు. ఈ సంఘటన వాల్మీకిపురం మండలంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. ఘటనపై పోలీసుల కథనం మేరకు.. మండల ంలోని విఠలం గ్రామానికి చెందిన రెడ్డి రామ్(30) పెయింటర్‌గా పని చేస్తున్నాడు. రోజూ మాదిరి గానే వాయల్పాడు కి వెళ్లి పెయింటింగ్ పనులు పూర్తి చేసుకుని సాయంత్రం బైకులో విఠలానికి బయలుదేరారు. వెళుతుండగా, మార్గ మధ్యంలోని విఠలం సమీపంలోని గుడి వద్ద బైక్ అదుపు తప్పి పడి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితున్ని స్థానికులు వెంటనే 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించే తన పరిస్థితి విషమంగా ఉందని తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# కన్నుల పండుగలా

# 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు





**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం ,ఆగస్టు 15 :** అన్నమయ్య జిల్లా రాయచోటి నందలి స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండులో అత్యంత వేడుకగా కన్నుల పండువగా 79వ భారత స్వాత ంత్ర్య దినోత్సవ వేడుకలు. నిర్వహి ంచారు. ఈ వేడుకలలో రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖామాత్యులు, జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై ఉదయం 9.00 గం.లకు జాతీయ పథకాన్ని ఎగురవేశారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్ఓ మసూదన్ రావు, ఆర్డీఓ శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఈ సదర్భంగా జిల్లా కలెక్టరు శ్రీధర్ చామకూరి, ఎస్పీ విద్యాసాగర్ నాయుడులతో కలిసి పెరేడ్ మైదానాన్ని రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖామాత్యులు మరియు జిల్లా మంత్రి పరిశీలించారు . ఈ సందర్భంగా జిల్లాలో అమలు చేస్తున్న ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖామంత్రి ప్రజలకు సందేశమిచ్చారు. అనంతరం వివిధ ప్లాటూన్లు మార్చ్ ఫాస్ట్ నిర్వహించాయి. ఇది పథకాలతో ఏర్పాటు చేసిన పలు శాఖల శకటాలు అక్కడికి విచ్చేసిన ప్రజలను బాగా ఆకట్టుకున్నాయి. అదేవిధంగా పలు శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేశారు ఇష్టాలను మంత్రి తో పాటు కలెక్టర్లు తిలకించారు. అదేవిధంగా పెరేడ్ గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు అక్కడ విచ్చేసిన ప్రజలను బాగా ఆకట్టుకున్నాయి ఈ సంస్కృతిక కార్యక్రమాలలో బాగా ఆసక్తికరమైన కొందరికి పదమదిసియా చర్య బహుమతులను అందజేశారు అదేవిధంగా పలు శాఖలకు సంబంధించిన అధికారులకు అవార్డుల్లో ప్రశంసా పత్రాలను మంత్రితోపాటు జిల్లా కలెక్టర్, ఎస్పీలు అందజేశారు.





**శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో:** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నాడు 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర సమరయోధులైన మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్ జవహర్లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాలవేసి నమస్కరించారు .పంద్రాగస్టు వేడుకలలో భాగంగా కళాశాల ఆవరణలో కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వి. బాలాజీ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కళాశాల అధ్యాపకులకు ,విద్యార్థిని విద్యార్థులకు, సిబ్బందికి స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్సింగ్ ,ఝాన్సీ లక్ష్మీ బాయ్ వంటి ఎందరో ప్రాణత్యాగమే నేడు స్వేచ్ఛా వాయువుల స్వతంత్ర భారతదేశం అని అభిప్రాయ పడ్డారు. స్వాతంత్ర్యానంతరం భారత దేశం విద్య, వైద్య, వ్యవసాయ, శాస్త్ర, సాంకేతిక మరియు అంతరిక్ష పరిశోధనలలో ప్రపంచంలోనే అగ్రస్థానానికి చేరుకుని పేదరికం, నిరక్షరాస్యత గణనీయంగా తగ్గి ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడి తద్వారా ఆర్థిక అసమానతలు తొలగాయాని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి బాధ్యతలను స్వీకరించి అనుకున్న లక్ష్యాన్ని సాధించి ఉన్నత స్థానాలను అధిరోహించాలని తద్వారా ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడుతోందని తెలిపారు. పంద్రాగస్టు వేడుకల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలు యందు ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు జ్ఞాపికలను మరియు ప్రశంస పత్రాలను బహుకరించారు. స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను, విన్యాసాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.వెంకటరమణ వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.




**కదిరి నారాయణ పాఠశాలలో :** పట్టణంలోని నారా యణ పాఠశాలలో 79వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఘనంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి సంబరాలను జరుపుకున్నారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సర్ఫరాజ్ ఖాన్ మువన్నెల జెండానుఆవిష్కరించి శ్వేత కపోతాన్ని ఎగురవేశారు , శ్వేత క పోతం గాలిలోకి ఎగరగా ,,, పావురాన్ని ఉద్దేశించి స్వేచ్ఛ జీవులుగా జీవిస్తున్నామని ఆయన వ్యాఖ్యానించారు జెండా ఆవిష్కరణ అనంతరం ఈ సందర్భంగా పాఠశాల డీన్ రమేష్ బాబు , పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం సర్ఫరాజ్ ఖాన్ మాట్లాడుతూ భారత స్వతంత్ర పోరాటంలో ఎందరో త్యాగమూర్తులు ప్రాణాలను బలిదానం చేసి అమరులయ్యారని కొనియాడారు వారి యొక్క ప్రాణ త్యాగ ఫలితాలే మనం స్వేచ్ఛాజీవులుగా జీవిస్తున్నామని అలాంటి భారతదేశ చరిత్రలో చిరంజీవులుగా మిగిలిపోతారని తెలిపారు జెండా ఆవిష్కరణ అనంతరం విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలలో ను సాంస్కృతిక కార్యక్రమాల లో అత్యంత ప్రతిభను కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు, చిత్రకళలో ప్రావీణ్యత పొందిన విద్యార్థి విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసి వారి ప్రతిభకు బహుమతులను అందజేశారు స్వాతంత్ర సమరయోధుల వేషధారణలో పిల్లలు ఎంతగానో ఆకట్టుకున్నారు ముఖ్యంగా ఝాన్సీ లక్ష్మీబాయి వేషాధారణ ,సంస్కృతి, హావభావాలు, కత్తి సాము ఎంతగానో ఆకట్టుకున్నాయి అనంతరం పాఠశాలలోని పిల్లలకు మిఠాయిలను పంచి పెట్టారు ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డీన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఏవో ,జక్రియ, పాఠశాల ప్రోగ్రాం ఇంచార్జ్ రెడ్డి హరిత, ఈ చాంప్స్ నియామత్ , ఈ కిడ్జ్ రాసినేని హరిత ,ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు , మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





**ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలో:** తనకల్లు - శ్రీ సత్య సాయి జిల్లా తనకల్లు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలను జాతీయ జెండాను ప్రధానో పాధ్యాయులు భాస్కర్, ఆధ్వర్యంలో పాఠశాల కమిటీ చైర్మన్ జాతీయ జెండాను ఎగురవేశారు. విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థు లందరూ దేశభక్తిని అలవర్చుకొని, దేశ ఉన్నతికి పాటుపడాలని, దేశాన్ని సుభిక్షంగా ఉండేటట్లు చూడాలని, ప్రతి ఒక్కరూ కుల,మత,జాతి వర్గబేధాలు లేకుండా దేశాభి వృద్ధికి పాటుపడాలని దేశ నాయకుల్లాగా ఎదిగి, గొప్పవారు కావాలని ఆకాంక్షించారు. అనంతరం 79వ స్వాతంత్ర దినోత్సవానికి సంబంధించి నిర్వహించిన వివిధ పోటీ పరీక్షలలో విజేతలైన విద్యార్థులకు ప్రథమ ద్వితీయ,తృతీయ బహుమతులను జనసేన పార్టీ యువనాయకులు యుగంధర్ విజయ తులందరికీ బహుమతులు, అందించారు. ఈ వేడుకలలో పాఠశాల బోధన, బోధ నేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు ఎంతో ఆనందంగా, ఆహ్లాదంగా పాల్గొన్నారు. విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక, పలు కార్య క్రమాలు పిల్లలకు కనువిందు చేశాయి. చివరగా విద్యార్థులకు మిఠాయి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధిని ఉపాధ్యాయులు ఉషారాణి , సల్మా పర్వీన్ , సుజాత, రత్న బాయ్, పద్మనాభ రెడ్డి యుగంధర్, రెడ్డి నాగయ్య, నాగార్జున, హరి, పాఠశాల బోధన, బోధ నేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






**టీసీ ప్రభుత్వ హైస్కూలో:** పామిడి పట్టణంలో ఉన్నటువంటి, టీ,సీ ప్రభుత్వ హైస్కూల్లో. ఆగస్టు 15 పురస్కరించుకొని స్కూల్ టీచర్స్ ఆధ్వర్యంలో మువెన్నెల జెండాను ఎగరవేసి1990-91 బ్యాచ్ అందరూ కలిసి 2024-25 సంవత్సరం పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థి విద్యార్థులకు ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులను ఇవ్వడం జరిగినది. మొదటి బహుమతి 5000 ద్వితీయ బహుమతి 3000, తృతీయ బహుమతి 2000, ఇవ్వడం జరిగినది అలాగే 24-25 సంవత్సరం గణిత శాస్త్రంలో అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థికి మొదటి బహుమతి అంబకర్ దినేష్. ద్వితీయ బహుమతి ప్రణీత భాయ్. తృతీయ బహుమతి.డి. శైలజ. గణిత శాస్త్రం అత్యధిక మార్కులు అంబకర్ దినేష్.కు 2116 ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో షఫీ.నాగరాజు. అనిల్ రాజ్ బుజ్జిబాబు శ్రీనివాసులు.బాబాసలాం. కృష్ణారావు. జీవన్. పుల్లయ్య, గాదిలింగప్ప పాల్గొన్నారు.

**మున్సిపల్ కార్యాలయంలో :** 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మున్సిపల్ చైర్ పర్సన్ కె ఎస్ దిల్షాదున్నిసా బహావుద్దీన్, అనంతరం గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కదిరి పురపాలక సంఘం కార్యాలయంలో అత్యుత్తమ పనితీరును కనపరిచిన ఉద్యోగులకు మరియు



ప్రోత్సహక బహుమతులను అందించి వారికి జ్ఞాపికను అందజేశారు ,అనంతరం వారికి దుశాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు సేగు సుధారాణి బాబయ్య, ఎం రాజశేఖర్ చారి, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.... అదేవిధంగా వేమన ప్రభుత్వ బాలుర పాఠశాలలో మోడల్ పాఠశాలలో స్వతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ ,అధ్యాపకులు, పిల్లలు ,మున్సిపల్ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు..

**గాండ్లపెంట తహసిల్దార్ కార్యాలయంలో :** మండలంలోని 79వ స్వాతంత్ర దినోత్సవ







వేడుకల్లో భాగంగా ఆధ్వర్యంలో జాతీయ పథకాన్ని ఆవిష్కరించిన తాసిల్దార్ బాబురావు అదేవిధంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి కొబ్బరికాయ కొట్టి ఘన నివాళు లు అర్పించారు. అదేవిధంగా ఎంపీడీవో కార్యాలయం జాతీయ పథకాన్ని ఆవిష్కరించిన ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అదేవిధంగా స్థానిక పోలీస్ స్టేషన్ జాతీయ పథకాన్ని ఆవిష్కరించిన ఎస్సై రవికుమార్ అదేవిధంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టి ఘన నివాళులు అర్పించారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా సచివాలయాలు, ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాల యందు జాతీయ పథకాన్ని ఆవిష్కరించి అదేవిధంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండయ్య,మాజీ సింగల్ విండో అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, గంగరాజు, మాజీ సర్పంచ్ గొడ్డు వెలుగుల ప్రసాద్, కాకర్ల రవీంద్రారెడ్డి,సర్పంచులు శివప్ప నాయుడు, సిఎన్ఎ సుధాకర, రహంతుల్లా, సికిందర్, బోర్ రవీంద్రారెడ్డి, రవీంద్రారెడ్డి, అక్రమ భాష, దొనకొండ ఆనంద్, సిద్ధారెడ్డి, హై స్కూల్ చైర్మన్ రెడ్డప్ప నాయక్, సొసైటీ బ్యాంక్ చైర్మన్ రామానుజులు రెడ్డి, దాసి రెడ్డి, కురు మామిడి గ్రామ అధ్యక్షుడులోకేష్, బూత్ కన్వీనర్ కృష్ణ నాయక్, తదితరులు పాల్గొన్నారు

**పత్తికొండ లో:** గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామపంచాయతీ గౌరవ అధ్యక్షులు



ఎస్ నాగరత్నమ్మ మాట్లాడుతూ, లో79వ స్వాతంత్ర దినోత్సవం ఘనంగా. నీర్వహించారు జాతీయ పథకానికి వందనం చేసారు."మన దేశానికి స్వాతంత్ర్యం రావడానికి అనేక మంది మహానుభావులు తమ ప్రాణాలను అర్పించారు. వారి త్యాగాల వల్లనే ఈ రోజు మనం స్వేచ్ఛాయుతమైన దేశంలో జీవిస్తున్నాము. స్వాతంత్ర్యం కేవలం మన హక్కుల గుర్తు మాత్రమే కాదు అది మన బాధ్యతల గుర్తు కూడా ప్రసంగించారు.ప్రతి భారతీయుడు తన దేశం పట్ల గౌరవం, సమాజం పట్ల నిబద్ధత, ప్రజాసేవ పట్ల తపన కలిగి ఉండాలి. అభివృద్ధి, ఐక్యత, న్యాయం ఇవి మన దేశాన్ని ముందుకు నడిపే మూడు స్తంభాలు అని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నరసింహులు సర్పంచ్ కొమ్ము దీపిక వార్డు మెంబర్స్ వెంకటేశ్వర రెడ్డి లింగన్న సుంకన్న రంగన్న బాల భాష హుస్సేన్ సురేంద్రబాబు మర్రి స్వామి మస్తాన్ షేక్షావలి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



**చెన్నూరులో:** విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి భావి భారత పౌరులుగా ఎదగాలని, తాము చదువుకున్న





పాఠశాలకు, గురువులకు, తమ కన్నవారికి, తమ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ట్రైని కలెక్టర్ నేలటూరి రమణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల వ్యాప్తంగా 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నూరు సరస్వతి నగర్ లో గల సరస్వతి శిశు మందిర్ పాఠశాలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు విద్యార్థి దశ నుండి మంచి ప్రవర్తనతో మెలగి సంపూర్ణమైన విద్యను అభ్యసించినట్లయితే మంచి ఉన్నత స్థాయికి చేరుతారని ఆయన అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని ఇది ఎరిగి విద్యార్థులు చదివినట్లయితే మంచి భవిష్యత్తు ఏర్పడుతుందని ఆయన అన్నారు. జాతీయ జెండాలో ఉన్న మూడు రంగులు ఎరుపు రంగు పౌరుషానికి ప్రతీక అయితే తెలుపు రంగు శాంతికి చిహ్నమని, అలాగే ఆకుపచ్చ రంగు, అభివృద్ధికి చిహ్నమని ఆయన తెలిపారు. ప్రతి పౌరుడు దేశాభివృద్ధికి పాటుపడాలని ఆయన తెలియజేశారు. అదేవిధంగా ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే తాసిల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సరస్వతి స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసులు జాతీయ జెండాను ఎదురు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిటి ఎంఈఓ గంగిరెడ్డి, వెంకటరమణ, ఆర్ ఐ. జి ఎన్. భాస్కర్ రెడ్డి, కల్లూరు విజయభాస్కర్ రెడ్డి, శివారెడ్డి, అధికారి రవికుమార్, ముని సుబ్బారెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ వారిష్, నాగి రెడ్డి, నిరంజన్ రెడ్డి, వీఆర్వోలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో

# ఉత్తమ సేవలకు ఉత్తమ పురస్కారాలు



**పల్నాడు – సూర్య వాస్తవం, ఆగస్టు 15:** 79 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం నాడు పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా ఎస్పీ, చేత ఉత్తమ సేవా పురస్కారాన్ని నరసరావుపేట డిప్యూటీ కలెక్టర్ కురుబ మధులత అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు సాయికుమార్, కృష్ణయ్య పద్మావతి, జయ కుమార్, నవీన హేమలత పాల్గొన్నారు.



**అన్నమయ్య జిల్లాలో :** అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ వద్ద బాధ్యతలు నిర్వహిస్తున్న సిసి మైసూర్యా రెడ్డి శుక్రవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చామకూరి చేతుల మీదుగా అవార్డు ప్రశంసపంత్రం తీసుకోవడం జరిగింది. సిసి చేసిన సేవలకు గాను కలెక్టర్ మంత్రిలు గుర్తించి తమకు ఈ అవార్డు అందజేయడం జరిగిందని ఆయన అన్నారు అంతేకాకుండా తమకు అవార్డును అందజేసిన సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు



**మదనపల్లిలో:** ప్రజలకు తాము చేసిన సేవలే అవార్డును అందించాయంటూ మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ గురుస్వామి అన్నారు. ఆగస్టు 15 సందర్భంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో ఆయన కు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి లు అవార్డు ప్రశంసా పత్రాన్ని అందజేశారు వారు మాట్లాడుతూ సేవ చేసిన వారినీ ఉన్న తాధికారులు ఎన్నడూ మరవరని కావున ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని కలిగి ప్రజలకు అందు బాటులో ఉంటూ సేవ చేసినట్లయితే తప్పకుండా వారికి కూడా ప్రశంసలతో పాటు అవార్డులు అందుతాయి అన్నారు. ఈ సందర్భంగా తమకు అవార్డు అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



**వీరబల్లిలో:** ప్రజలకు తాము చేసిన సేవలే అవార్డును అందించాయంటూ వీరబల్లి మండలం గృహ నిర్మాణ శాఖ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు ఆగస్టు 15 సందర్భంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో ఆయనకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరిలు అవార్డు ప్రశంసా పత్రాన్ని అందజేశారు వారు మాట్లాడుతూ సేవ చేసిన వారినీ ఉన్న తాధికారులు ఎన్నడూ మరవరని కావున ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని కలిగి ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేసినట్లయితే తప్పకుండా వారికి కూడా ప్రశంసలతో పాటు అవార్డులు అందుతాయి అన్నారు. ఈ సందర్భంగా తమకు అవార్డు అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు



**గుత్తిలో :** గుత్తి పట్టణం మున్సిపల్ ఆఫీసు యందు ఘనంగా 79వ స్వాతం త్ర్య దినోత్సవ వేడుకలు జరిగిన వి.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ బి.జబ్బార్ మియా,చై ర్ పర్సన్ వన్నూర్‌బీ చేతుల మీ దుగా మువ్వన్నెల జెండా ఆవిష్క రణ జరిగినది. 2024–25 సవత్స రమునకు గాను మున్సిపల్ సి బ్బందికి,సచివాలయ సిబ్బంది కి,మరియు వర్కర్లకు ప్రతిభ అ వార్డులు అందజేయడం జరిగిన ది.కార్యక్రమములో కౌన్సిలర్లు మే నేజర్ రాంబాబు,డి.ఈ.ఈ హేమ చంద్ర,శానిటరీ ఇన్స్ పెక్టర్ మహ బూబ్ బాషా,మెప్మా సి.ఓ చంద్ర శేఖర్,మున్సిపల్ స్టాఫ్ సిబ్బంది, వర్కర్స్ సిబ్బంది,ప్రజా కళా కారు లు రామదాసు,మల్లి కార్జున మరి యు మిత్ర బృందం,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు వైసిపి నా యకులు షఫీ,మల్లికార్జున పాల్గొ న్నారు.ఈ సందర్భంగా చైర్ పర్స న్ వన్నూర్ బీ,కమీషనర్ బి.జ బ్బార్ మియా,మేజర్ రాంబాబు ప్రజా కళాకారుడు రాందాసు స్వా తంత్ర్య దినోత్సవం గురించి,గుత్తి పా మిడి,పెద్దవడుగురు,గుంత క ల్లు,ఉరవకొండ, కళ్యాణదుర్గం, హిందూపూర్,అనంతపురం జి ల్లాల నుండి స్వాతంత్ర్య పోరా టంలో పాల్గొన్న వారిని స్మరించు కున్నారు.



**పామిడిలో :** గుంతకల్లు నియోజకవర్గం పామిడి మండలం పాళ్యం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ శివశంకర్ నాయుడు జిల్లాలోనే ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారుయ ఈ సందర్భంగా ఆయన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఇన్చార్జి కలెక్టర్ శివ నారాయణ శర్మ చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా శివ శంకర్ నాయుడు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు సంవత్సరానికి పరిది మేరకు పని దినాలు కల్పించినందుకు గాను నాకు ఈ అవార్డు రావడం జరిగిందని గుంతకల్లు శాసన సభ్యులు గుమ్మనూరు జయరాంకి, ఆయన తనయుడు పామిడి మరియు గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ కి పామిడి ఎంపీడీఓకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.





**అనంతపురంలో:** సింగిల్ యూస్ ప్లాస్టిక్ పై గత నాలుగు సంవత్సరాలుగా డిస్కవర్ అనంతపురం గ్రీన్ ఆర్మీ చేస్తున్న పోరాటం సేవలు గుర్తిస్తూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా డిస్కవర్ అనంతపురం వ్యవస్థాపకులు సామాజిక వేత్త అనంతపురం అనిల్ కుమార్ , వారి టీం సభ్యులకు అనంతపురం నగర పురపాలక సంస్థ కమిషనర్ ఎమ్మెల్యే ,ఎంపీ ఘనంగా సన్మానించి పురస్కారం అందజేశారు. అనిల్ కుమార్ ప్రత్యేకించి గత మూడు సంవత్సరాలుగా వీరు చేసిన లక్షలాది పట్ట సంచిలో ఈ సంవత్సరం చేస్తున్న వేలాది చీర సంచులు అనంతపురంలో ప్లాస్టిక్ కి ప్రత్యామ్నాయ వస్తువులు వాడకంపై వీరు తెచ్చిన అవగాహన అభినందిస్తూ కమిషనర్ బాలస్వామి పురస్కారం అందజేశారు

ఉత్తమ సేవలకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్న తాసిల్దార్



**పెళ్లకూరులో :** పెళ్లకూరు మండలంలో మండల రెవెన్యూ అధికారిగా పనిచే స్తున్న సిహెచ్ హరికృష్ణ కు తన విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించారు , ఈ సేవలను పురస్కరించుకునీ శుక్రవారం స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టర్ ఆఫీస్ నందు రెవెన్యూ శాఖ మంత్రి ఆనం .రామనారాయణ రెడ్డి జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా మండలంలో పలువురు నాయకులు, అధికారులు ఆయనకు అభినందనలు ,ప్రశంసలు వర్షం కురిపించారు.



**నాయుడుపేటలో:** తిరుపతి జిల్లా నాయుడుపేట అర్బన్ సీఐ బాబి విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన నాయుడుపేట పట్టణ సీఐ బాబి 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉత్తమ సేవా పురస్కార అవార్డును అందు కున్నారు.శుక్రవారం తిరుపతిలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి,జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు లు సీఐ బాబీకి ఉత్తమ సేవా పురస్కార పత్రాన్ని అందజేశారు.



**కర్నూలులో :** కర్నూల్ జిల్లా అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ నరసప్ప జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు అందుకున్నారు. కర్నూలు పట్టణంలోని పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేదికపై రాష్ట్ర మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా నరసప్ప అవార్డు అందుకున్నారు. కర్నూలు జిల్లా అధికారుల సమక్షంలో ఆయన అవార్డు అందుకున్నారు. కర్నూల్ కు రాకముందు అనంతపురం లో ఆయన పని చేశారు. మంచి వ్యక్తిగా ఆయనకు పేరు ఉంది. అనంతపురం నుండి కర్నూలు అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గ ఆయన బాధ్యతలు చేపట్టారు.విధి నిర్వహణలో చిత్తశుద్ధి, సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు పొందారు. ఆయన సేవలను గురించి జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఆయనకు ఉద్యోగులు, వివిధ వర్గాల వారు, అనంతపురం బార్ వాకర్స్ శేఖర్ మాస్టర్ ,సీన, ప్రసాద్, రామకృష్ణ (ఆర్కే), భాస్కర , అది, పరదేశి, శ్రీరామ్, ఫణి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

**అనంతపురం కలెక్టరేట్ లో :** అనంతపురంలోని సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయ పీ.ఆర్.ఓ సూర్యకు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు లభించింది. అనంతపురం పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి



పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా సూర్య అవార్డు అందుకున్నారు. ఇంచార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సమక్షంలో ఆయన అవార్డు అందుకున్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )